# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 36 సంచిక 9
పేజీలు 40
మే 2017

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ....................2
శ్రీబాబూజీ ఉవాచ....................4
అమ్మమాట....................7
ఎందరో మహాత్ములు ....................10
కఠోపనిషత్ ....................11
త్రిపురా రహస్యం ....................14
సంధ్యావందనం లోని రహస్యం ....................16
ధర్మము - పాపము .................. ....................18
రఘునాధ దాసు ....................19
చిత్తము ....................21
యోగవాశిష్ఠము ....................23
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................25
పరిప్రశ్న ....................26
శ్రీ తారక పరబ్రహ్మ ప్రసాద్.................... 28
రాబోయే జన్మ ....................30
శ్రీకృష్ణకర్ణామృతము....................31
అనన్య భక్తి ....................33
మానవ నైజం ....................35
లోభి - పేద ....................36
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర.....37
విష్ణు కథలు- మీరాబాయి....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

**సయేవ సర్వం యద్భూతం యచ్చ భవ్యం సనాతనమ్।**

**జ్ఞాత్వా తం మృత్యుమత్యేతి నాన్యః పంథా విముక్తయే ॥**

(కైవల్యోపనిషత్ - 9 శ్లో॥)

దేహ మనోబుద్ధులతో ప్రాపంచిక విషయాదులతో తాదాత్మ్యమే బంధన. దానిని వదిలించుకోనిదే పరమాత్మతత్త్వానుభూతిని పొందటం అసంభవం. అయితే సాధకులు సద్గురుమూర్తిని ఆశ్రయించి, బంధ విముక్తికి సులువైన మార్గాన్ని అనుసరించ టానికి ఎంతో ఆశతో ఎదురుచూడవచ్చు. కాని విముక్తికి దుఃఖమయమైన ప్రాకృతిక ప్రపంచాన్ని అధిగమించటం మినహా వేరొక మార్గం లేదు.

సాధకుడు మృత్యువును అధిగమించి, అమృతత్త్వ స్థితిని స్థిరమైన మార్పులు, పరిణామము లేని స్థితికి చేరటమే ముక్తస్తితి అని కేవలం బుద్ధితో గ్రహించటం కాక, అనుభవ పూర్వకంగా తెలుసుకోవటమే సజీవమైన ఆధ్యాత్మిక అనుభవ జ్ఞానము.

పరమాత్మ సనాతనమైనది. భూత, భవిష్యత్, వర్తమానకాలముల యందు నిత్య తత్త్వమై ప్రకాశించేది అని అనుభవ పూర్వకముగా తెలుసు కోవటమే ముక్తి. అది మాత్రమే మృత్యువును అధిగమించే మార్గము.

జాగ్రదావస్థలో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను మనస్సు యొక్క ప్రమేయంతో గ్రహించగలుగుతున్నాడు. రూప నామ భేదాలను గ్రహించ గలుగుతున్నాడు. అయితే స్వప్నంలో కూడా వివిధ దృశ్యాలను వీక్షించ గలుగుతున్నాడు. శబ్దాలను వినగల్గుతున్నాడు. ఎన్నో అనుభవాలను పొందుతున్నాడు. వీటన్నింటి వెనుక మనస్సే వివిధ రూపాలను ధరించినట్లు జగత్తులో భూత భవిష్యత్, వర్తమానకాలాలలో

వివిధ రూపాత్మక జగత్తుగా రూపొంది దర్శింపజేసేది ఆ పరమాత్మయే అని గ్రహించగలగటమే ఉత్తమమైన జ్ఞానము. అదే జ్ఞాత్వా అంటే. అది కేవలం అనుభూతి. అంతేగాని బుద్ధితో గ్రహించటం మాత్రం కాదు. దీనిని సాధించటానికి ధ్యానం ఎంతో సహకరిస్తుంది.

శ్రీ సద్గురుదేవులు బోధించినట్లుగా **'ధ్యానాగ్నిదగ్ధకర్మాణం'** అన్నట్లు ధ్యానం ద్వారా దేహ మనో బుద్ధుల ప్రాపంచిక మోహం రహితం కాక తప్పదు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

మే 2017

10 బుధవారం -వైశాఖ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

21 ఆదివారం - శ్రీగురుదశమి(హనుమజ్జయంతి) - ఉదయం 11 గం॥లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

జూన్ 2017

09 శుక్రవారం జేష్ఠ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

19 సోమవారం - శ్రీగురుదశమి, సాయంత్రం 5గం॥30 నిలకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "ఈ శరీరము సత్యమా? అసత్యమా?" అని ప్రశ్నించారు. "శరీరము అసత్యమైతే మీ దేహాన్ని కాదనగలరా? పోనీ ఈ జగత్తునంతా కాదనగలరా? మనమంతా మాట్లాడుతున్నాము నడుస్తున్నాము. తింటున్నాము. సంభాషణ చేస్తున్నాము. నిదురపోతున్నాము. మళ్ళీ నిదురనుండి మేల్కొంటున్నాము. మరి ఇదంతా అసత్యమేనంటరా?'' అని ప్రశ్నించారు. శ్రీ బాబూజీ మహరాజ్ బోధను కొనసాగిస్తూ "యథార్థంగా మనమంతా స్వప్నజగత్తులో ఉన్నాము. స్వప్నంలో మనం ఎన్నో చూస్తాం. ఎన్నో అనుభూతులు పొందుతాం. సుఖం కలిగితే సంతోషిస్తాం. కష్టము కలిగితే దుఃఖిస్తాం దుఃఖము కలిగినట్లు కంటి వెంట అశ్రుధారల గుర్తులు కూడా ఉండవచ్చు. ఎన్నో భయానక దృశ్యాలు కూడా చూడవచ్చు. మెలకువరాగానే అవన్నీ అసత్యమని గ్రహిస్తాం. కానీ స్వప్నంలో మాత్రము అది యథార్థమే కదా! కాబట్టి మనమంతా జాగ్రదవస్థలో ఉన్నామని అనుకుంటున్నా, యథార్థంగా జగత్తు అనే మాయలో కలత నిదురపోతూ స్వప్న జగత్తులో ఉన్నా. కలత నిదురనుండి మేల్కొలిపి ఇదంతా అసత్యమని తెలియజేసేవాడే సత్యగురువు ఆయన సత్యమార్గాన్ని చూపిస్తారు. దానినే నిజజాగ్రదవస్థ అంటారు.



అనుభవం లేని భోక్త గురువు గానీ, బోధ గురువుగాని అయితే తమ పాండిత్యంతో జనాలని రంజింపజేయవచ్చు. గ్రంథాలు చదివి వచ్చి స్టేజిమీద ఉపన్యాసాలు దంచేయవచ్చు. 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' అని ఎంతో చాకచక్యంగా వివరించవచ్చు. కానీ ఉన్నదంతా సత్యమైన బ్రహ్మమే. జగత్తు అనేది దానికి భిన్నంగా లేదనే అనుభూతిని వారు పొందనప్పుడు

వారిని ఆశ్రయించిన శిష్యులకు నిజజాగ్రదవస్థని గురించి ఏమి చెప్పగలరు? తాము నిజజాగ్రదవస్థను గుర్తిస్తే కదా శిష్యులను జాగృతము చేయగలిగేది. ఇక్కడ మీకొక ఉదంతాన్ని చెబుతాను. మన లాయరు పార్థసారథిగారి స్నేహితుడు కూడా లాయరే. మానవాకారంలో ఉన్న వ్యక్తిని గురువుగా పూజించడమేమిటి? అని ఆయన విమర్శించాడట. చదువుకున్నవారు, విజ్ఞానవంతులు అయి ఉండి ఇటువంటి విమర్శలు చేసే వ్యక్తులే దేవాలయాలకి వెళ్ళి శిలా విగ్రాహాలని దేవతామూర్తులుగా ఎలా ఆరాధించగల్గు తున్నారు? కాబట్టి ఎవరి విశ్వాసం వారిది. శిలా విగ్రహాన్ని భగవంతునిగా ఆరాధించినపుడు చైతన్యవంతుడైన సద్గురుమూర్తిని ఆరాధించడములో అభ్యంతరమేమిటి? ఇలాంటి తెలిసీ తెలియని వ్యక్తులే తాము తెలివైన వారము అనుకుని కొన్ని అసందర్భమైన ప్రశ్నలు లేవనెత్తుతారు.

కొలది రోజులక్రితం ఋషీకేష్ నుంచి వచ్చిన ఒక సన్యాసి ఒక సందేహాన్ని వ్యక్తం చేశారు. వినాయకుడిని చూసి చంద్రుడు నవ్వినందుకు వినాయకచవితి నాడు మనమెవ్వరమైనా చంద్రుని చూస్తే అపనిందలపాలు అవుతామని శపించడం వలన చేయని తప్పకు మనమెందుకు శిక్ష అనుభవించాలి? అని ప్రశ్నించారు ఆ సన్యాసి. సందేహము కలుగవచ్చు తప్పలేదు. కానీ ఆ సందేహము లేవదీసిన వ్యక్తి కేవలం వేషధారణకి సన్యాసిగాని, ఉండకూడని అన్ని వ్యసనాలూ ఉన్నాయి. ముందు తనని తాను సంస్కరించుకుని తానెవరో తాను గుర్తిస్తే ప్రశ్నవేసే పని ఉండదుకదా! అన్నారు. శ్రీ బాబూజీ మహారాజ్, ఆ సన్యాసి వేసిన వేరొక ప్రశ్నని పురస్కరించుకుని శ్రీ హనుమాయమ్మ గారిని, శ్రీ తారకం గారిని ప్రత్యగాత్మ అంటే ఏమిటి? అని ప్రశ్నించారు.

తారకం గారు సమాధానం చెబుతూ 'అంతరాత్మ' అన్నారు. హనుమాయమ్మగారు బదులు చెబుతూ 'జీవాత్మ' అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ మళ్ళీ ప్రశ్నిస్తూ "అంతరాత్మ', 'జీవాత్మ' అనేవి వేరువేరుగా ఉన్నాయా? భలే తలచిక్కు బేరాలు తెచ్చిపెట్టారే" అన్నారు శ్రీ తారకంగారు సమాధానం చెబుతూ అంతరాత్మ అన్నా, జీవాత్మ అన్నా ఒకటే అన్నారు. శ్రీ బాబూజీ మహారాజ్ తిరిగి ప్రశ్నిస్తూ "జీవాత్మ, పరమాత్మకి భిన్నంగా

ఉందా? అలా అయితే మరిద్వైతము ఉన్నట్లే గదా? అప్పుడు జగత్తు సత్యమౌతుందేమో?" అని ప్రశ్నించారు. ఇంకా బోధ కొనసాగిస్తూ "సర్వత్రా వ్యాప్తమైయున్న ఆత్మవస్తువు ఒకటే. అదే చైతన్యము. కానీ ఈ జగత్తుగా భాసించే ప్రతి వస్తువును ప్రకాశింపచేసే దానినే జీవాత్మ లేక ప్రత్యగాత్మ అంటారు. అది పరమాత్మకి భిన్నంగాలేదు పరమాత్మ లేక చైతన్యము మహాకాశమైతే జీవాత్మ ఘటాకాశం. ఘటము అశాశ్వతమైనది. అది విచ్ఛిన్నమైతే ఘటాకాశం మహాకాశానికి భిన్నముగా ఉండదుకదా! అలాగే ఒక ఉపాధికి పరిమితమై దానిని ప్రకాశింపజేసే ఆత్మ వస్తువునే జీవాత్మ లేక ప్రత్యగాత్మ అంటారు. ఉపాధి పరిణామం చెందేది. అశాశ్వతమైనది. ఉపాధి క్షీణత చెందినపుడు ప్రత్యగాత్మ లేక జీవాత్మ పరమాత్మకి భిన్నముగా ఉండదు కదా! కాబట్టి ఋషీకేష్ సన్యాసి లేవనెత్తిన సందేహము అనుసరించి ఈ దేహము లేక జగత్తు సత్యము అనే అజ్ఞానంలో ఉన్నవారికి జీవాత్మ పరమాత్మ అనేవి భిన్నంగా భావించక తప్పదు. దానినే ద్వైత దృష్టి అంటారు. బ్రహ్మము, జగత్తు అనే భావనే ద్వైతం. యథార్థమైన విషయాన్ని గుర్తించలేకపోయిన స్థితినే సుషుప్తి అంటారు.

యథార్థమైనదానిని వేరొక విధంగా చిత్రీకరించే స్థితియే స్వప్నావస్థ కాబట్టి జగత్తు అంతా యథార్థమనీ ఈ దేహమే తానని భావన చేసే స్థితిలోఉన్న మానవుడు స్వప్న జగత్తులో ఉన్నట్లేగదా!" అన్నారు. శ్రీ బాబూజీ మహారాజ్ ఇంకా మాట్లాడుతూ పంచదార గ్లాసు ప్రక్కనే నీరు నింపిన గ్లాసు ఉంది. నీటికి పంచదార మధురత్వము వస్తుందా! ఆవరణ దోషం ఉంది. ఒక దీపము ఉంది దానిపైన ఒక మట్టి మూకుడు బోర్లించి ఉంది. ఆ దీపపు కాంతిని అందుకో గలమా? ఆవరణ దోషము ఉంది. దానివలన సర్వ వ్యాప్తమైన ఆత్మ వస్తువుని గుర్తించలేక పోతున్నావు. ఆవరణ దోషము వలననే ఆత్మ వస్తువుని జీవాత్మ అని అంటున్నావు. నీవు ఈశ్వరుడవు అయినప్పటికి ఆవరణ దోషం వలన జీవత్వభావన తొలగదు. దానిని తొలగించేవాడే ఆచార్యుడు" అన్నారు.

(గత సంచిక తరువాయి) - జపమాల ప్రసాద

# అమ్మ మాట

## భజగోవిందమ్ మూఢమతే!

శ్రీ ఆది శంకర భగవత్పాదాచార్యులవారు మనకి అనేకానేక స్తోత్రాలను, శ్లోకాలను, వివేకచూడామణి వంటి ప్రకరణ గ్రంథాలను అందించారు. వాటిలో 'భజగోవింద' శ్లోకాలు కూడా చాలా ప్రాముఖ్యత చెందినవి. ఒకసారి శ్రీ భగవత్పాదులవారు కాశీ నగరంలో పర్యటన చేస్తున్న సమయంలో ఒకచోట ఒక సంస్కృత పండితుడు 'డుకృఞ్కరణే డుకృఞ్కరణే' అనే వ్యాకరణ సూత్రాన్ని పదేపదే వల్లెవేస్తూ కనిపించాడు. అతన్ని చూసి స్వామివారు "భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే। సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్కరణే" అని మొదలు పెట్టారు. "ఓరీ! మూఢమతీ! గోవిందుని భజించు. గోవిందుని భజించు. నీ అంత్యకాలం సమీపించేవేళకు నువ్వు వల్లెవేస్తున్న ఈ 'డుకృఞ్కరణే' వంటి వ్యాకరణ సూత్రాలు నిన్ను రక్షించవు సుమా! కనుక గోవిందుని భజించు" అన్నారు.



ఇక్కడ శ్రీ శంకరులు రెండుసార్లు గోవిందుని భజించు, గోవిందుని భజించు అన్నదానిలో అర్థం మనం రెండు విధాలుగా చెప్పుకోవచ్చని పెద్దలు చెబుతారు. గోవిందుడు అంటే శ్రీకృష్ణదేవుడని చెప్పుకోవచ్చు; మరో విధంగా చూస్తే ఆదిశంకరాచార్యులవారి గురువులయిన శ్రీగోవింద భగవత్పాదాచార్యులవారని కూడా చెప్పినట్లయింది. 'భజ్' అనే ధాతువుకి 'సేవాయాం' అనే అర్థం కూడా వుంది. కనుక, "ఓ మూఢమతే! ఎంతసేపూ నువ్వు వ్యాకరణ సూత్రాలనే వల్లెవేస్తూ కాలం గడిపేస్తున్నావు. నీ మరణ కాలం దగ్గరకి వచ్చినప్పుడు ఇవేవీ నిన్ను రక్షింపజాలవు. కేవలం భగవన్నామ స్మరణ మాత్రమే నిన్ను జనన మరణ రూప సంసార బంధం నుండి రక్షిస్తుంది. కనుక

యిప్పటికైనా గోవిందుని భజించరా మూఢా!" అని అనేక విధాలుగా పరమార్థాన్ని బోధించారు. ఇవే భజగోవింద శ్లోకాలుగా ప్రసిద్ధికెక్కాయి.

భజ్ సేవాయాం; భ - ప్రకాశం, జ - జనించింది అని కూడా ఈ భజ్ అనే ధాతువుకి అర్థం చెప్పుకోవచ్చు. ప్రకాశం నుండి పుట్టినది, ప్రకాశ స్వరూపుడు గోవిందుడు కనుక గోవిందుని నుండి జనించింది అని చెప్పుకోవచ్చు. ఇక రెండవసారి గోవిందుని భజించు అని చెప్పడంలో, మనస్సు ద్వారా సూక్ష్మంగా సద్గురువులయిన శ్రీ గోవింద భగవత్పాదుల వారిని శరణు పొందమని చెప్పడమయినది.

'గో' అంటే 'జ్ఞానమును' విందుచేసేవాడు గోవిందుడు అనికూడా చెప్పుకోవచ్చు. మహాత్ములు మనం ఏవి చేయవచ్చో, ఏవి చేయకూడదో చెప్పివుంచారు. వాటినిగాని మనం తు.చ. తప్పకుండా ఆచరణలో పెట్టగలిగితే, జీవన్ముక్తి అనేది మనకి కరతలామలకం అవుతుంది.

జుట్టు నెరిసిపోయి, వృద్ధాప్యం మీద పడి, చావుకి దగ్గరలో వున్నా కూడా, భగవంతుని తలవకుండా, భగవన్నామ స్మరణ చేయకుండా, ఏవో పొట్టకూటికై నాలుగుకాసులు సంపాదించాలనే ఆశతో, వ్యాకరణ సూత్రాలను వల్లెవేస్తున్న బ్రాహ్మణుని చూసి, శ్రీ ఆది శంకర భగవత్పాదుల వారు ఎంతో ఆవేదనతో మానవ లోకానికి అందించిన మణిపూసలు ఈ 12 భజ గోవింద శ్లోకాలు. వీటినే 'ద్వాదశ మంజరీ స్తోత్రం' అని కూడా అంటారు. దీనికి భగవత్పాదులవారి 14మంది శిష్యులు 14శ్లోకాలు అందించారు - ఇవి 'చతుర్దశ మంజరి' శ్లోకాలుగా ప్రసిద్ధి గాంచాయి. ఈ 26 శ్లోకాలకు మరొక 4 శ్లోకాలు జోడించి శ్రీశంకరులు దీనికి "మోహముద్గరం" అనే పేరును ప్రసాదించారు.

'దేహమే నేను' అనే మోహంలో పడి గుర్రం వలె పరుగులు పెడుతున్న జీవుడికి కొరడా దెబ్బల్లాగ పనిచేస్తాయి యీ భజగోవింద శ్లోకాలు. ఒక్క మాటలో చెప్పాలంటే 'మోహానికి గొడ్డలి పెట్టు' అన్నమాట.

**నారీ స్తనభర నాభీదేశం । దృష్ట్వా మాగా మోహావేశం ।**
**ఏతన్ మాంస వసాది వికారం । మనసి విచింతయ వారం వారం ॥**

ఈ ప్రపంచంలో మోహావేశాలకు గురిచేసే అనేకానేక విషయ వికారాల మధ్య జీవిస్తున్నారు మానవులు. నోరు గోవింద నామస్మరణ

చేస్తున్నా, మనస్సు విషయ వికారాలవైపు పరుగులు తీస్తూ వుంటుంది. ఇక్కడ శ్రీ ఆదిశంకరులు మనకు హెచ్చరిక చేస్తున్నారు - "ఓరీ మూఢా! స్త్రీ యొక్క అవయవ సౌష్టవం చూసి మోహానికి గురి అయిపోతున్నావే! కొంచెం విచారించి చూస్తే నాభి, స్తనములు యిత్యాది అవయవాలన్నీ కేవలం వికారమైన మాంస ఖండాలే కదా! ఈ మాత్రం దానికి అంత మోహ పరవశడవయిపోతున్నావే. ఈ శరీరం కేవలం మాంస, మల, మూత్రాది ధాతువులచేతనే నిర్మింపబడినది కదా - ఇది అనిత్యం కదా! అని నిరంతరం పదే పదే నీ మనస్సులో విశేషంగా చింతించు. నిరంతర విచారణ వలన నీలో జనించిన మోహవికారాలు, కామ పిశాచము నశిస్తుంది." అని శ్రీ శంకరభగవత్పాదులవారు చెబుతున్నారు.

ఆకలి వేసినవాడికే తినే పదార్థం యొక్క విలువ తెలుస్తుంది. భగవన్నామము, భగవత్తత్త్వము మన యొక్క ఆకలిని తీరుస్తాయి. ఈ భజగోవింద శ్లోకాలు ఈనాటివి కావు. ముందు ముందు జరుగబోయే వాటిని గురించి మహాత్ములు మనకి ఏనాడో చెప్పివుంచారు. బిడ్డ పుట్టగానే తల్లి తన స్తన్యమిస్తుంది. అవే స్తనాలని ఇప్పుడు పెద్దయ్యాక చూసి మోహిస్తున్నాడు. మోహమనే గుర్రం పిచ్చిగా పరుగులు పెడుతోంది. దానికి ఛళ్ మని వాతలు పడేటట్లు తమ అమృత వాక్కులనే కొరడాతో మనస్సు మీద వాతపెడుతున్నారు శ్రీ స్వామివారు.

మనం సమోసాలగురించో, సెల్‌ఫోన్‌లగురించో విశేషంగా పదే పదే చింతిస్తాం. కానీ మనకి జననమరణ మనే రోగం వుందని, దాని నుంచి బయటపడాలంటే నిరంతర విచారణ చేయాలి అంటే చేయం. అందుకనే శ్రీ ఆదిశంకరులు ఈ దేహం యొక్క నిజతత్త్వం గురించి పదేపదే 'మనసి విచింతయ వారం వారం' చింతన చేయమని హెచ్చరిస్తున్నారు. కుడితిలో పడ్డ ఎలుకలాగ, శ్లేష్మంలో పడ్డ ఈగలాగ, ప్రపంచ విషయాదులలోనే మునిగిపోవద్దురా! నువ్వు ప్రపంచంలో వుండు. కానీ ప్రపంచాన్ని నీలోకి రానీయకు. గోవిందుడిని భజించు. భజగోవిందం, భజగోవిందమ్ గోవిందమ్ భజ మూఢమతే!"

-సశేషం

# ఎందరో మహాత్ములు

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

మనం ఏ పని చేసినా దానికి రెండు ప్రయోజనాలు వుండాలని ఆర్ష ధర్మం నిర్ణయించింది - **ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ** అని. 1. మనకు మోక్షం కలగటం, 2. జగత్తుకు హితం కలగటం. ఈ రెండు ప్రయోజనాలు సాధించలేని పనులన్నీ మనకు కర్మలుగా చుట్టుకుంటాయి.

చివరికి మనం తినే ఆహారం కూడా భగవంతుని నివేదన చేసిన తరువాత ఆ ప్రసాదాన్ని మనం స్వీకరించాలి గానీ, మన రుచుల కోసం, మన ఆకలి కోసం కాదు అని '**యజ్ఞశిష్టామృత భుజః యాన్తి బ్రహ్మ సనాతనం; భుంజతేతే త్వఘం పాపా యే పచంత్యాత్మ కారణాత్**' వంటి గీతా వాక్యాల ద్వారా చెప్పబడినది.

'ఒక యోగి ఆత్మకథ' అనే గ్రంథంలో శ్రీ పరమహంస యోగానంద వారు తమ తల్లిదండ్రులు కేవలం సంతానప్రాప్తి అనే ధర్మం కోసం సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే సంసారం చేసేవారని వ్రాశారు.

ఇటువంటి ధర్మాలకు మూలస్థంభాలనదగిన ఎందరో మహాత్ములు ఏకాంతంగా సాధనచేసి, మోక్షాన్ని పొందుతున్నారు. అయితే అలా పొందినవారిలో కొద్దిమంది మాత్రమే మళ్ళీ సద్గురువులుగా వచ్చి జనబాహుళ్యాన్ని సన్మార్గంలో నడిపి ఉద్ధరిస్తున్నారు.

మరి అలా తిరిగి రాకుండా ఏకాంతంలోనే ఉండిపోయిన మహాత్ముల వలన జగద్ధితం ఎలా సమకూరుతుంది? అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది.

దీనికి సమాధానంగా శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్‌వారు ఎన్నోసార్లు తమ బోధలో - 'ఎందరో మహాత్ములు హిమాలయాలలో, అడవులలో, కొండగుహలలో తపస్సు చేసుకుంటూ ప్రతి ఉదయం తమ సాధన నుండి బయటకు వచ్చి తమ శక్తినంతా ధారపోసి 'సర్వేజనాః సుఖినో భవన్తు! లోకా స్సమస్తా సుఖినో భవన్తు! అని ఆశీర్వదించి, తిరిగి సమ సాధనలో లీనమవుతూ ఉంటారు. వారెవరో ఈ లోకానికి పరిచయం లేకపోయినా కేవలం వారి ఆశీస్సుల వలననే ఈ లోకం ఇలా పచ్చగా కళకళలాడుతోంది. అందుకు మనం వారికి ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉండాలి" అనేవారు.

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

# కఠోపనిషత్

ఎవరు పంచ భూతాలకన్నా ముందు ఉద్భవించారో, ఎవరు ప్రాణుల హృదయ గుహలో ఉన్నారో, అదే నువ్వు అడిగిన వస్తువు. ప్రాణరూపమైనది, సమస్త దేవతల రూపమైనది, పంచ భూతాలతో ఉద్భవించినది, ప్రాణుల హృదయాలలో ఉన్నదో అదే నువ్వు అడిగిన వస్తువు.

గర్భవతులైన స్త్రీలలో పెరిగే పిండంలాగా, కట్టెలలో అగ్నిలాగా వెలిగే ఆత్మ మన శరీరంలో మండుతూ ఉంటుంది. జాగృతి చెందిన యోగులు ఈ ఆత్మాగ్నిని అనునిత్యం దర్శిస్తూ ఉంటారు. ఆ ఆత్మాగ్నే నువ్వు అడిగిన వస్తువు.

ఎవరి వల్ల సూర్యుడు ఉదయిస్తున్నాడో, ఎవరివల్ల అస్తమిస్తున్నాడో, అన్ని లోకాలకు వెలుగును ప్రసాదించే భగవంతుడే నువ్వు అడిగిన వస్తువు.

**"యదేవేహ తదముత్ర, యదముత్ర తదన్విహ"** ఇక్కడ ఏది ఉన్నదో అదే అక్కడ ఉన్నది. అక్కడ ఏది ఉన్నదో అదే ఇక్కడ ఉన్నది. ఈ పరతత్త్వాన్ని చూడగలిగినప్పుడే అతడికి బ్రాహ్మీస్థితి లభిస్తుంది. సర్వత్రా వెలసి వున్నవాడు, భూత భవిష్యత్కాలాలకు ప్రభువు హృదయగుహలో బొటనవేలు పరిమాణంలో కొలువై ఉన్నాడు. ఆయనను తెలుసుకుంటే ఇంక ఎవరినీ ద్వేషించం- నువ్వు అడిగిన వస్తువు అదే.

పదకొండు ద్వారాలు(కళ్ళు, ముక్కులు,చెవులు, నోరు, బ్రహ్మ రంధ్రం, నాభి,రెండు గుహ్యేంద్రియాలు) కలిగిన ఈ దేహం ఆత్మ యొక్క గర్భం అని భావించి ధ్యానించినవాడు దుఃఖాలనుండి విముక్తి పొందుతాడు. ఆ ఆత్మ సర్వత్రా ఉన్నది. ఆకాశంలో సూర్యుడిగా, అంతరిక్షంలో వాయువుగా, అగ్నిగా భూమిగా, ఇంట్లో అతిథిగా, జీవిలో జీవిగా సత్యంలో నిత్యంగా, ఋతంలో బృహదత్వంగా నెలకొని ఉన్నది. మానవ శరీరాన్ని భవనంగా చేసికొని ప్రాణాన్ని పైకి పంపటం, అపానాన్ని క్రిందకు త్రోయటం చేస్తున్నాడు. శరీరంనుంచి ప్రాణం విడివడి

పోయినప్పుడు, ఏమి జరుగుతోంది, ఏది మిగులుతోంది? అదే నీవు అడిగిన వస్తువు. దేనిని ఆధారం చేసికొని ఈ ప్రాణాపానాలు పని చేస్తున్నాయో,అదే ముఖ్య ప్రాణం. దాని ఆధారంతోనే సమస్తం జీవిస్తాయి.

నచికేతా! మరణానంతరం ఈప్రాణం ఏమవుతుంది? అన్నది రహస్యం. మరణానంతరం కొందరు మానవ దేహాన్ని పొందుతారు. కొందరు స్థావరాల వంటి అచరాలుగా ఉంటారు. కర్మ ఫలాలనుబట్టి జన్మ ప్రాప్తిస్తుంది. ఇంద్రియాలు నిదిరించినప్పుడు ఏది మేల్కొని ఉంటుందో అదే ఆత్మ. అది అవినాశి. ఆత్మ ఒకటైనా సమస్త జీవులలో విరాజిల్లుతోంది.

ఒకటే అయినది, సమస్తాన్ని పాలించేది, అందరిలో కొలువై ఉన్నది, హృదయంలో నివసించేది, అనేకంగా భాసించేది అయిన ఆత్మను అనుభూతిలో గ్రహించినవారికే శాశ్వతానందం లభిస్తుంది.

నచికేతుడు: అటువంటి ఉత్కృష్టమైన అనుభూతి స్వయంప్రకాశమా? లేక వేరొకదానితో ప్రకాశింపబడుతోందా?

యమధర్మరాజు: అక్కడ సూర్యుడు ప్రకాశించడు.చంద్రుడు, నక్షత్రాలు మెరుపులు ప్రకాశింపవు. స్వయం ప్రకాశమైన ఆత్మననుసరించే సమస్తమూ ప్రకాశిస్తాయి. శరీరంలో కాంతి ఉండగానే ఈ వెలుగును చూడగలగాలి.

ఈ ప్రపంచం రావిచెట్టులాంటిది. పైన వేళ్ళు, క్రింద వ్యాపించిన కొమ్మలు కలది. అదే భగవంతుడు. అవినాశి. సమస్త లోకాలు దానియందే ఉన్నాయి. నువ్వు అడిగిన సత్యం అదే. ఈ లోకాలన్నీ ప్రాణంనుంచి అభివ్యక్తమవుతున్నాయి. ప్రాణం చేత పని చేస్తున్నాయి. అది తెలుసుకొన్నవారు అమరులవుతారు.

ఆ మూలానికి భయపడే ప్రంపంచం నడుస్తోంది; అగ్ని మండుతోంది; సుర్యుడు ప్రకాశిస్తున్నాడు; ఇంద్రుడు, వాయు దేవుడు, తమ తమ కార్యాలను నిర్వహిస్తున్నారు. ఐదవవాడైన మృత్యు దేవుడు ఆ భయం వల్లనే పని చేస్తున్నాడు.

శరీరపతనానికి మునుపే ఈ సత్యాన్ని గ్రహించగలిగితే, అంతరిక సాక్షాత్కారం అవుతుంది. లేకపోతే మళ్ళీ జన్మ వస్తుంది.

బుద్ధిలో అద్దంలాగా; పితృలోకంలో కలలాగా; గంధర్వ లోకంలో నీటిలాగా;బ్రహ్మలోకంలో అస్పష్టమైన నీడలాగా; స్పష్టమైన ఎండలాగా అంతరిక సాక్షాత్కారం లభిస్తుంది.

ఎప్పుడు పంచేంద్రియాలు విశ్రాంతి స్థితిలోఉంటాయో, బుద్ధి ప్రయత్న రహితమై ఉంటుందో, ఆ స్థితిని పరమ పదం అంటారు.

ఇంద్రియాలను నియంత్రించే స్తితియే యోగం. అట్టివాడు ఆత్మ జాగృతి పొందినవాడు. ఈ సత్యం "ఉన్నది" అని మొదట తెలుసుకోవాలి.. అప్పుడు సత్య స్థితి అనుభూత మవుతుంది.

హృదయంలో 101 నాడులు ఉన్నాయి. వాటిలో ఒకటి మూర్ధానికి చొచ్చుకుపోతుంది. దానిద్వారా పైకి వెళ్ళేవాడు అమరత్వాన్ని పొందుతాడు. తక్కిన నాడుల ద్వారా బయటకి వెళ్ళేవాడు వివిధలోకాలలో తిరుగుతూ ఉంటాడు.

శరీరంలో ఆత్మ బ్రొటన వేలు పరిమాణంలో ఉంది. అది అందరి హృదయాలలో విరాజిల్లుతూ ఉంటుంది. ముంజగడ్డిని ఈనెలనుంచి వేరు తీసినట్లు ఆత్మను శరీరంనుంచి వేరు చేయాలి. ఆ ఆత్మ పావనమైనది, అమరమైనది అని తెలుసుకో - అని బ్రహ్మ విద్యను యమధర్మరాజు నచికేతునికి బోధించాడు.


## వేసవిలో శిక్షణా తరగతులు!

1-5-2017 నుండి 31-5-2017 వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 9346382563

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

# త్రిపురా రహస్యం

## జ్ఞాన ఖండం

దత్తాత్రేయుడు భార్గవునికి చెబుతున్నాడు " హేమలేఖ మాటలను విని, విషయాదులు రసవిహీనమని తెలుసుకొని, హేమచూడుడు వాటికి విముఖుడైనాడు. ఎప్పుడూ ఏదో దుఃఖంలో ఉన్నట్లు కనిపించేవాడు. చాలాకాలంగా అనుభవించిన విషయ వాసనలు మనసులో పాతుకొని ఉన్నాయి. వాటిని వదల లేకపోయాడు. భోజ్య పదార్థాలు, ఆభూషణాలు, వాహనాలు స్త్రీలు, అతనికి సంతోషాన్ని కలిగించలేకపోయాయి.



అతని పరిస్థితి చూసి హేమలేఖ," మీరు మునపటిలా ఉల్లాసంగా లేరు, కారణం ఏమిటి?" అని ప్రశ్నించింది.

హేమచూడుడు : నువ్వు చెప్పినది విన్న తరువాత విషయ పదార్థాలు నాకు సుఖాన్ని ఇవ్వటంలేదు. వాసనావశమున విషయాలను అనుభవిస్తున్న నాకు సుఖం కలగటంలేదు. దుఃఖమే కలుగుతోంది. దేనివలన సుఖం కలుగుతుందో నాకు తెలియచెయ్యి.

హేమలేఖ: (తనలోఇతనికి నిజమైన నిర్వేదం కలిగింది. ఇతడు శ్రేయోమార్గంలోనే ఉన్నాడు. త్రిపురాదేవిని ఆరాధించటం వల్లనే నిర్వేద స్థితి ఇతనికి కలిగింది అని గ్రహించి) నా పూర్వ వృత్తాంతాన్ని చెబుతున్నాను విను. అని ఇలా చెప్పసాగింది "నా తల్లి నాతో ఆడుకోవటానికి నాకొక చెలికత్తెను ఇచ్చింది. ఆమె స్వభావతః సతి( సాధ్వియే). నా తల్లి లేని సమయంలో ఆమెకు ఎవరో తెలియని అసతితో

సంపర్కం కలిగింది. (తల్లి- స్వప్రకాశమైన శుద్ధ చితి; చెలికత్తె - బుద్ధి; నేను - జీవచితి - (శుద్ధచితి) అంశమే; ఆడుకోవటం - సుఖ దుఃఖానుభవం; అవిద్య - అజ్ఞానం; అసతి - లేనిది; అనుసంగతా - ఆమెతో కలిసిపోయినది (తన స్వరూపాన్ని వదలి ప్రపంచ విషయాకారంగా మారింది.)

ఆ నా చెలి అసచ్చరిత్రతో కలిసిపోయింది. ఆ చెలిని నేను ప్రాణం కంటె ఎక్కువగా ప్రేమించాను. నా మనస్సు ఆమెపై ఉండేది. ఆమె ఆ దుష్ట నటితో ఎప్పుడూ ఉండేది. ఆ నటి(అవిద్య) పుత్రుడైన అస్థిరుని నేను పెంచాను. అతని భార్య చపల. వారికి ఐదుగురు కుమారులు (త్వక్, చక్షుః, శ్రోత్ర, జిహ్వా ఘ్రాణములనే జ్ఞానేంద్రియాలు) కలిగారు. వారినికూడా నేనే సాకాను. వారు తమ తండ్రిని వశం చేసికొని తమ ఇండ్లకు(శబ్ద,స్పర్శ, రూప, రస గంధాలు) తమతో తీసికొని పోతున్నారు (ఇంద్రియాలు మనస్సును వశం చేసికొన్నాయి). అస్థిరుని స్నేహితుడు ప్రచారుడు (ప్రాణం) మహా బలవంతుడు. అతడు అస్థిరుని పుత్రులను మనస్సు, స్రోత్రాదీంద్రియాలను సదా కాపాడుతూ ఉంటాడు.

ప్రాణం ఇంద్రియాలను రక్షిస్తూ ఉంటుంది. శరీరం పతనమయినప్పుడు ప్రాణమే లింగ శరీరాన్ని వేరొక శరీరంలోకి చేరుస్తుంది. ఇట్లా జీవుడు కర్మానుభవం కోసం అనేక శరీరాలలో ప్రవేశించి సుఖ దుఃఖాలను అనుభవిస్తాడు.

సత్సాంగత్యంవల్లను, భగవదనుగ్రహంచేత వివేకం కలిగి మోహం నశిస్తుంది. మోహంతో పాటు దాని కుటుంబమంతా నశిస్తుంది. బుద్ధికి వివేకం, వైరాగ్యం కలగగానే జీవుడికి పరమాత్మానుసంధానం కలుగుతుంది. అదే పరమానందస్థితి.

సవికల్ప సమాధిలోకూడా ఆనందం కలుగుతుంది. కాని అది స్థిరమైనది కాదు. జ్ఞానోదయం అయిన తరువాత, జ్ఞాని లోక వ్యవహారారలో పాల్గొన్నా, వాటి గుణ దోషాలు, పుణ్యపాపాలు అతనికి అంటవు. హేమలేఖ ఆ స్థితిని పొంది ఉన్నది. అదే జీవన్ముక్త స్థితి. సద్గురు సమాశ్రయం వల్ల అట్టి స్థితి లభిస్తుంది.

-సశేషం

# సంధ్యావందనం లోని రహస్యం

- రమణ ప్రసాద్

**ధ్యాయేత్సూర్య మనంతకోటి కిరణమ్ త్రైలోక్య చూడామణిమ్ ।**
**భక్తానామభయ ప్రదమ్ దినకరం జ్యోర్మయం శంకరమ్ ॥**

విశ్వకర్మ తన కుమార్తె సంజన కోసం వరాన్వేషణ చేస్తూ సూర్య భగవానుని తన కుమార్తెను వివాహమాడమని కోరగా, ఆయన అంగీకరించటంతో వారి ఇరువురికీ వివాహం అవుతుంది. సంజన సూర్యుని తేజస్సును భరించలేకపోయింది. సూర్యుని తీవ్ర కిరణాలకు ఆమె శరీరం నల్లబడింది. ఆ వేడికి ఆమె శక్తి క్షీణించ సాగింది. ఆమెకు తన భర్తమీద మక్కువ తగ్గింది. ఇప్పుడు ఆమె వన్నె సాయం సమయపు రంగులో ఉండటం వలన ఆవెను దేవతలు 'సంధ్య' అని పిలువసాగారు.



సూర్యుని బారినుండి తప్పించుకోవటానికి సంజన తన ప్రతిరూపాన్ని సృష్టించింది. ఆమెకు 'ఛాయ' అని పేరు పెట్టి, ఎట్టి పరిస్థితులలోను సూర్యుని సాన్నిధ్యాన్ని వీడవద్దని చెప్పి, తను పుట్టింటికి వచ్చేసింది. ఛాయతో సూర్యునికి శని అనే పుత్రుడు కలిగాడు. అతని శరీరం తన తల్లి లాగా నల్లగా ఉన్నది.

సూర్యునికి శని పుట్టాడని తెలిసి విశ్వకర్మ సంజనను ఏమి జరిగిందో చెప్పమని నిర్బంధించగా, ఆమె జరిగినదంతా చెప్పింది. విశ్వకర్మ తన కుమార్తెను వెంటనే భార్యగా తన స్థానాన్ని నిలబెట్టుకొమ్మని చెప్పి సూర్యుని వద్దకు పంపాడు. సంజన వచ్చి తన ఆజ్ఞను పాటించనందుకు ఛాయ శరీరాన్ని కాల్చి వేసింది. అప్పుడు ఆమె సూర్యుని కాంతిలో కనపడే ఒక రూపంగా మిగిలింది.

ఇదంతా తెలియని సూర్యుడు సంజనతో యముడు అనే కొడుకును, యమున అనే కుమార్తెను కన్నాడు. శని తల్లి తండ్రుల ప్రేమకు నోచుకోక అలసత్వంతో జడుడిగా కర్తవ్య విమూఢుడుగా తయారయ్యాడు. ఆ ముగ్గురూ పెరిగి పెద్దవారైయ్యారు. సూర్యుడు వారికి విధులను నియమించాలని తలచాడు. సంజన, "శని ఏ విధులను

సరిగ్గా నిర్వర్తించలేడ"ని సూర్యునికి చెప్పింది. సూర్యుడు శనికి ఏ పని అప్పగించలేదు. యమునిని ధర్మరాజుగా నిమించాడు. యమునకు పాపాలను ప్రక్షాళన చేసే పవిత్ర నదిగా స్థానం కల్పించాడు. అగ్రజుడుగా శని అవమానాల పాలై ఒంటరియై మిగిలిపోయాడు. ఇటు తల్లి ప్రేమకు నోచుకోలేక, అటు తన తండ్రి ఎదుట పడలేక, తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకో లేకపోయాడు. అతనిలో ప్రతీకార జ్వాలలు రేగాయి. కోపంగా వెళ్ళి తల్లి అయిన సంజన గర్భం మీద గట్టిగా తన్నాడు. సంజన నివ్వెర పడి తేరుకొని, "నన్ను తన్నిన నీ కాలు పడిపోవు గాక!" అని శపించింది. దానితో శని నేలపైన పడిపోయాడు. ఇదంతా గమనించిన సూర్యుడు, " శని ప్రవర్తనను క్షమించినా, తల్లి కొడుకును శపించటం వింతగా ఉన్నద"ని సంజనను నిలదీసి, నిజం చెప్పమన్నాడు. సంజన, 'శని తన ప్రతిరూపమైన ఛాయ కుమారుడని చెప్పి తన తప్పిదాన్ని క్షమించమని కోరింది. సూర్యుడు శనికి తన జేష్ట పుత్రుని హోదా ఇచ్చి, అతని పోయిన కాలు వచ్చేటట్లుగా చేసి, నవగ్రహాలలో అతనికి స్థానం ఇచ్చి, కర్మ ధర్మాలను నియంత్రించే అధిపతిగా చేశాడు. అప్పుడు దేవతలందరూ శనిని ఈ విధంగా స్తుతించారు:-

**నీలాంజన సమాభాసమ్, రవి పుత్రమ్ యమాగ్రజమ్ ।**
**ఛాయ - మార్తాండ సంభూతమ్, తం నమామి శనైశ్చరమ్ ॥**

సూర్యుని ప్రచండ కిరణాలను తట్టుకోలేక సంజన భర్తను వీడి అరణ్యంలో ప్రవేశించి, ఎవరూ గుర్తించకుండా ఆడ గుఱ్ఱంగా మారి చరించసాగింది. సూర్యుడు భార్యా వియోగాన్ని భరించలేక వెదుకుతూ గుఱ్ఱం రూపంలో ఉన్న సంజనను గుర్తించి, తానుకూడా గుఱ్ఱంగా మారి ఆమెను సంభోగిస్తాడు. తత్ఫలితంగా అశ్వని కుమారులు (కవలలు)జన్మిస్తారు. వారు ఆయుర్వేద చికిత్సా విధానంలో నిష్ణాతులవుతారు. వారు సూర్య రథాన్నిలాగే సప్తాశ్వాల కళ్ళాలను పట్టుకొని, సూర్యోదయంతో ప్రధమ కిరణాలుగా వస్తారు, వారు భిషగ్వరులు కనుక ఆ కిరణాలకు ఎదురుగా నుంచున్నవారు ఆరోగ్యవతులవుతారు. ఇలా చేయటం వేదోక్తంగా వారి తల్లి అయిన సంజన లేక సంధ్యను గౌరవించినట్లవుతుంది. అందుకే సూర్యుని ప్రధమ కిరణాలను ఆహ్వానిస్తూ 'సంధ్యా వందనము' చేస్తూ అర్ఘ్యం వదులుతాం. అలా చేస్తూ గాయత్రి మంత్ర జపం చేస్తాము .

# ధర్మము ~ పాపము

- గాలి జగదీశ్

ఒకరోజు ఒక వేటగాడు అడవిగుండా వెళ్తున్నాడు. ఒక పెద్దపులి అతన్ని తరుముకుంటూ వచ్చింది. వాడు ప్రాణభయంతో పరుగెత్తి, పరుగెత్తి అలసిపోయి, శక్తిహీనుడై ఒక చెట్టుపైకి ఎక్కి కూర్చున్నాడు. కానీ ఆ పెద్దపులి వాడిని వదలలేదు. వాడెప్పుడైనా దిగుతాడు కదా, అప్పుడే వాడిని ఆహారంగా తినాలని నిశ్చయించుకుని ఆ చెట్టు క్రిందే కూర్చుంది.

ఆ చెట్టు పైభాగంలో ఒక ఎలుగుబంటు ఉంది. అప్పుడు పులి ఆ ఎలుగుబంటుతో 'ఆ మానవుణ్ణి నువ్వు క్రిందకు త్రోసెయ్యి. నేను వాడిని ఆహారంగా స్వీకరించి నా దారిన నేను పోతాను' అన్నది. దానికి ఆ ఎలుగుబంటు సమాధానంగా 'ఆ మానవుడు నా యింటికి అతిథిగా వచ్చాడు. అతిథిని సత్కరించాలిగానీ, సంహరించ కూడదు. ఆ పాపాన్ని నేను చేయలేను" అని చెప్పింది.

తరువాత కొద్దిసేపటికి ఎలుగుబంటు నిద్రలోకి జారిపోయింది. పెద్దపులి చెట్టుక్రిందే కూర్చున్నది. అప్పుడు ఆ పులి ఆ వేటగాడితో 'ఆ ఎలుగుబంటు నిదురపోతోంది. దాన్ని నీవు క్రిందకు జారవేస్తే నేను దానిని ఆహారంగా తీసుకుని నా దారిన నేను పోతాను' అన్నది. అప్పుడు ఆ వేటగాడు వెంటనే ఆ ఎలుగుబంటును క్రిందకు తోసేస్తాడు. కానీ దైవవశాత్తు అది ఆ చెట్టుకొమ్మల మధ్యలో ఇరుక్కుని రక్షింపబడి మళ్ళీ పైకి తన స్థానంలోకి ఎక్కి కూర్చుంది. రెండుచేతులతో ఎదుటివాడికి హాని చేయాలనుకుంటే వెయ్యిచేతులతో భగవంతుడు రక్షిస్తాడు అంటే ఇదేనేమో!

అప్పుడు ఆ పులి ఆ ఎలుగుబంటుతో, 'చూడు! ఆ మానవుడు ఎంత కృతఘ్నుడో! నీవేమో అతనిని రక్షించాలని ఆశ్రయమిచ్చావు. కానీ వాడు నీకు కీడు తలపెట్టాడు. కాబట్టి ఇప్పటికైనా నీవు వాడి మీద దయ చూపకుండా వాడిని క్రిందకు తోసెయ్యి' అన్నది.

దానికి ఎలుగుబంటు సమాధానమిస్తూ **'నా ధర్మం నేను చేసాను, వాడి పాపం వాడు అనుభవిస్తాడు'** అన్నది.

**పుణ్య జీవితానికి అలవాటు పడినవాడు పాపం చెయ్యలేడు!**

# రఘునాథ దాసు

సేకరణ - మురళి

(వార్తాలాపము నుండి)

బెంగాలులోని సప్తగ్రామ్ జమిందారు ఏకైక కుమారుడు రఘునాథ దాసు. అతడు జమిందారు బిడ్డయైనప్పటికినీ ఆ అనంత వైభవములుగానీ, విషయభోగములుగానీ, రాచకార్యములుగానీ అతనిని ఆకర్షించకపోగా, అతను వాటిని కంటకములుగా భావించేవాడు. అతనిని విషయాదులవైపు మరల్చాలని తండ్రి చేసిన ఏ ప్రయత్నములూ ఫలించ లేదు. చివరకు ఒక సౌందర్యవతితో వివాహం జరిపించాడు. ఈ ప్రయత్నం కూడా నిష్ఫలమైనది.

కొంతకాలానికి రఘునాథుడు పూరీలో వున్న గౌరాంగ ప్రభువు సన్నిధికి చేరాడు. నాలుగైదు రోజులు ఆయన దగ్గరనే ప్రసాదాన్ని స్వీకరించాడు. తరువాత ఇది తగదు అనుకొని, జగన్నాథ స్వామి సింహద్వారంలో భిక్షకుల మధ్యలో కూర్చుని, భక్తులు పంచిపెట్టే ప్రసాదాన్ని తీసుకొని తృప్తిపడ్డాడు. గౌరాంగ ప్రభువుకు రఘునాథుడు భిక్షాటనతో గడుపుతున్నాడని తెలిసి ఎంతో సంతోషించి, 'ఇతడు నిజంగా రత్నము. నిజమైన వైరాగ్యం కలిగింది. గౌరవము, ఇంద్రియ భోగమ, రుచి, సిగ్గు మొదలగు వాటిని అతడు లక్ష్యపెట్టలేదు. సన్యాసి భిక్షచేసి జీవించటమే ఉత్తమమం" అన్నారు.

కొన్ని రోజులకు రఘునాథుని తండ్రికి ఈ విషయం తెలిసి, 'ఇంతటి వైరాగ్యం కలిగిన పుత్రుడు నాకు కలిగినందుకు నేను ధన్యుడను' అని భావించాడు. ఒక వ్యక్తికి నాలుగు వందల రూపాయలు ఇచ్చి, పూరీలో వున్న తన కుమారునికి నౌకరును, భోజన సదుపాయాన్ని కలిగించమని' పంపించాడు. (ఆ రోజులలో నెలకు, ఒక మనిషికి అర్థరూపాయి సరిపోతుండేది) రఘునాథుడు ఇంటిని, కుంటుంబమును, పరివారమును, సమస్తమును త్యజించి వచ్చి, తండ్రి పంపిన ధనుము తీసుకోవటం యుక్తం కాదని, అధర్మమని, సన్యసించిన తరువాత విషయాదులను సేవించిన సన్యాసి సిగ్గులేనివాడని తలచి, ఆ సేవకుని యింటికి త్రిప్పి పంపించివేశాడు.

ప్రజలు అతనిని గుర్తించి భిక్ష అధికంగా యిచ్చేవారు. ఇది గ్రహించిన రఘునాథుడు భిక్షాటన మానివేశాడు. ఈ సంగతి గౌరాంగ ప్రభువు తెలిసికొని, "రఘునాథుడు సర్వోత్తమమైన పని చేశాడు. సింహద్వారం వద్ద భిక్ష కొరకు వేచి వుండుట వేశ్యవృత్తి. నోటితో నామము చేస్తున్ననూ, చిత్తమునందు ఎవరైవనా భిక్ష వేస్తే బాగుండును అని ఆలోచిస్తుంటుంది" అన్నారు.

ఒకరోజు రఘునాథుడు అన్నక్షేత్రానికి వెళ్ళి భిక్ష తీసుకుని

నామసంకీర్తన చేస్తుండగా, స్వరూపగోస్వామి అక్కడకు వేంచేశారు. 'రఘు సింహద్వారం వద్ద భిక్షను ఎందుకు మానివేశాడు?' అని అడిగి, విషయం తెలిసికొని, 'చాలా చిత్రం! వైరాగ్యమందు ఏ మాత్రం లోపం కనిపించిననూ వెంటనే ఆ పనిని మానివేస్తాడు' అన్నారు. 'ఇందుకు నేనెంతో సంతోషిస్తున్నాను' అని గౌరాంగ ప్రభువు అన్నారు.

రఘునాధుడు తన వద్ద ఒక చినిగిన బొంత మాత్రము వుంచుకుని, రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్రించి, మిగతా సమయం నామస్మరణతో గడిపేవాడు. రఘునాధుని దీక్ష, తితీక్ష, సహనము, జిహ్వా సంయమనము హద్దులుదాటి వుండేది. అన్నక్షేత్రాధికారులు తనకు ఎక్కువ భిక్షపెట్టటం గమనించి, అన్నక్షేత్రానికి వెళ్ళటం కూడా మానివేశాడు. పూరీజగన్నాథంలో దుకాణంలో ప్రసాదం అమ్ముతుంటారు. రెండు మూడురోజులు అమ్ముడవని ప్రసాదం పాడవటం వలన వీధులలో పారవేస్తారు. దాన్ని అక్కడ ఉన్న ఆవులు కడుపునిండా తిని, మిగిలినది వదిలివేయగా, సాయంకాల సమయంలో రఘునాధుడు అక్కడకు వెళ్ళి ఆ మిగిలిన ప్రసాదం, కొంచెం బెల్లం కలుపుకుని తినేవాడు.

రఘునాధుని ఈ ప్రవర్తన గౌరాంగ ప్రభువుకు తెలిసి, ఆయన ఆనందానికి మేరలేదు. ఒకరోజు గౌరాంగ ప్రభువు ఆ సమయానికి అక్కడకు చేరుకుని, రఘునాధుని 'ఏమయ్యా! ఇంత రుచిగల ప్రసాదాన్ని నీవు ఒక్కడివే తింటున్నావా? నాకూ కొంచెం పెట్టవా?' అని అడిగి, అతని పాత్ర నుండి త్వరగా ఒక గుప్పెడు అన్నం తీసుకుని తననోటిలో పెట్టుకున్నాడు. రఘునాధుడు 'అయ్యో! అయ్యో!' అంటూ అత్యంత దీనతో కన్నీరు కారుస్తూ ఆ పాత్రను రెండు చేతులతో మూసివేస్తూ, 'ప్రభూ! తమరు ఏమి చేస్తున్నారు? ఈ అన్నము తమకు తగదు. ఈ కుళ్ళిపోయిన ఉచ్ఛిష్టాన్ని తమరు తిని నన్ను పాపాత్ముణ్ణి చేయకండి' అని ప్రార్థించాడు.

ఇంతలో నోటిలో పెట్టుకున్న ముద్దను తినివేసి, రెండవ ముద్దకోసం మరల తిరిగి ఆ పాత్రలో గౌరాంగులు చెయ్యిపెట్టటం అప్పుడే అక్కడకు వచ్చిన స్వరూప గోస్వామి చూసి, గౌంరాంగుని చేతులు పట్టుకుని 'ప్రభూ! ఇది తమకు తగదు' అన్నారు. గౌరాంగులు ఆ ముద్దను మ్రింగుచూ 'స్వరూప్ జీ! నేను నిజం చెప్పుచున్నాను. నేటి ఈ అన్నం ముద్ద ఉన్నంత రుచిగల పదార్థము ఇదివరలో నేనెప్పుడూ తినలేదు" అన్నారు. ఎంతటి వైరాగ్యము!!

# చిత్తము

- పరాశర ప్రసాద్

లోకజనని సీతాదేవి ఉపదేశం వలన శ్రీరామచంద్రుడు తారక బ్రహ్మమను విషయం తెలిసికొన్నప్పటికీ హనుమ మాట్లాడుతూ, 'శ్రీరామ చంద్రుడు మాత్రమే పరబ్రహ్మమని ఇతర దైవములను నేను ఎరుగను' అని ప్రస్తావించిన తరువాత సీతాదేవి హనుమకి చిత్తమును గూర్చి వివరించుటం జరిగింది.

పరబ్రహ్మము నీకంటె భిన్నంగా భావించటానికి హేతువు కేవలం భ్రమ మాత్రమే. ఆ భ్రమ తొలగే మార్గమే యోగము. చిత్తవృత్తి నిరోధః యోగః అన్నట్లుగా చిత్తము యొక్క బాహ్య సంచారము నిరోధించి, అంతర్ముఖం చేసినట్లయితే వృత్తులు నిరోధింప బడతాయి. చిత్తము అనేది నిర్మలమైన సత్త్వగుణ పరిణామమైన అంతఃకరణము.

చిత్తము యొక్క అవస్థలు అయిదు రకాలు -

1. క్షిప్తము, 2. మూఢము, 3. విక్షిప్తము, 4. ఏకాగ్రము, 5. నిరుద్ధము.

చిత్తము రజోగుణ ప్రభావముచేత సుఖదుఃఖాలను అనుభవిస్తూ, అస్థిరము, పరిణామ రహితము అయినప్పుడు దానిని క్షిప్తము అని భావన చేయబడుతోంది. అది రాక్షస వృత్తులకు నిలయమై వుంటుంది.

కొన్ని సందర్భాలలో చిత్తము తమోగుణ ప్రభావానికి లోనై ఇది చేయ దగినది, ఇది చేయరానిది అనే విచక్షణ కోల్పోయి క్రోధావేశముచేత విరుద్ధ కార్యముల యందుప్రవర్తించెడి చిత్తము మూఢముగా వ్యవహరింపబడుతోంది. అటువంటి వ్యక్తులే మూఢులు లేదా మూర్ఖులు. అటువంటి వ్యక్తులే రాక్షసులు లేదా పిశాచాలుగా పిలువబడతారు.

సత్వగుణప్రధానమై దుఃఖము కలిగించే ప్రక్రియలన్నిటికీ అతీతంగా వుండి శబ్దము ద్వారా, ప్రవర్తన ద్వారా, క్రియ ద్వారా సుఖసంతోషాలకు నిలయమైన చిత్తము 'విక్షిప్తము'. అటువంటి దైవీసంపదలకు నిలయము బాహ్య విషయాదులను వాంఛింపని

చిత్తము 'ఏకాగ్రము'. అయితే వృత్తులు, సంస్కారములు పూర్తిగా అదృశ్యమైనట్లు భావించకూడదు. వృత్తులు సంపర్కము అన్నీ అణిగివుండి, అంతర్ముఖమైన చిత్తము 'నిరుద్ధము'గా భావింపబడుతోంది. నిరుద్ధమంటే వృత్తిరాహిత్యమన్నమాట. ఆ స్థితినే యోగము అనవచ్చును. అదే జ్ఞానస్థితి. పురుషుని స్వరూపము జ్ఞానమే. యోగము లేని దశ వ్యుత్థాన దశ. ఆదశలోనే వృత్తులు ఉద్భవిస్తాయి.

వృత్తికలిగిన తోడనే సుఖం, దుఃఖము, ఆశ, మోహము అనేవి బయల్పడతాయి. అవి జీవ లక్షణాలు. పురుషుడు మాత్రము ఎప్పుడూ నిర్లిప్తుడే సుమా! ఆధ్యారోపము వలన పురుషుడు కూడా ఇంద్రియ వ్యాపారము వలన విషయాకారముగ గోచరింపజేయునదియే చిత్తము.

చంద్రుడు నీటి తరంగములలో ప్రతిబింబించినప్పుడు తరంగములు కదిలిన తోడనే చంద్రుడు కదిలినట్లు వృత్తులు చిత్తము యొక్క పరిణామ విశేషములు. అవి క్లేశములుగా భావింపబడతాయి. చిత్తవృత్తికి సంకేతము కర్తృత్వము వహించటం. యోగము సాధించిన వ్యక్తిలో కర్తృత్వ భావన వుండదు. అది కేవల అభావస్థితి. వృత్తి వుంటేనే భావనకు అవకాశము.

***సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి***

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మే 2017, జూన్ 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మే 2017: AS 4253, 7270 , LM 4094, 4095, 4097

జూన్ 2017: AS 7226, 7283

– మేనేజర్

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

- సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ



ఆ విధంగా రాణి చూడాల పవిత్రమైన, సర్వ వ్యాపకమైన, శాశ్వతమైన ఆత్మ పై యేకాగ్రతతో సాధన చేసి, ఆత్మ సాక్షాత్కారమును పొందింది. ఆమె జ్ఞాని, యోగిని కూడ, ఆమెకు యోగశక్తులున్నవి, ఆమె గగనముపై నడవగలదు, ఆమెకు, అణిమాద్యష్ట సిద్ధులు, దివ్య శక్తులున్నాయి.

శిఖధ్వజునకు తన భార్య జ్ఞాని, యోగిని అనే నమ్మకంలేదు, చూడాల తన భర్తకు, ఆత్మ జ్ఞాన ప్రబోధము చేయటానికి ప్రయత్నించింది. కాని ఆమె ప్రబోధము వలన శిఖధ్వజుడు లబ్ధిపొంద లేదు.

శిఖధ్వజుడసంతృప్తికరమైన జీవితాన్ని కొనసాగించాడు, ఆయనకు మనశ్శాంతి లేదు ఒక రోజు చూడాలతో యిలా అన్నాడు "ఈ భౌతిక జీవితం వలన, నేను సుఖాన్ని పొందటంలేదు, నా యెద బాధకు గురైనది. నేనీ రాజ్యాన్ని వదలి అరణ్యానికి వెళ్ళి, తపస్సు, ధ్యానము చేసుకోవాలను కొంటున్నాను, నాకు అనుజ్ఞ యివ్వవలసింది" అని భార్యకు చెప్పాడు.

అప్పుడు చూడాల యిలా చెప్పింది "ఓ పతిదేవా! మీరు రాజ్య పాలనకు స్వస్తి చెప్పి, వనవాసం చేయటానికిది సరియైన సమయం కాదు". శిఖిధ్వజుడు చూడాల మాటలను లెక్క చేయలేదు, అతను అర్థరాత్రి సమయమున రాజ ప్రాసాదమును వదలి, పన్నెండు రోజులు, నడిచి, మంధర పర్వత శ్రేణిపైన వున్న అరణ్యములోకి ప్రవేశించాడు. అతనక్కడ కఠిన తపస్సు చేస్తూ మంత్రోచ్ఛారణ చేస్తూ, కేవలము ఫలాలను భుజిస్తూ జీవించాడు, ఆ తపస్సుతో, శిఖిధ్వజుడు కృశించాడు.

చూడాల నిద్రలేచే సరికి తన భర్త తన పక్కన లేడు, వెంటనే

ఆమె తన భర్త వనవాసానికి వెళ్ళాడని గ్రహించింది. ఆమె భర్త చేసిన పనికి చాలా బాధపడ్డది, ఆమె పద్దెనిమిది సంవత్సరాలు, రాజ్యపాలన చేసింది. ఇప్పడామె తన భర్త పరిస్థితి యెలా వున్నదో, తెలుసుకోవాలని నిర్ణయించు కొన్నది. ఒక రాత్రి ఆమె తన యోగ శక్తితో గగన మార్గాన నడిచి, మంధర పర్వతముపై అడుగిడింది. ఆమెకు కామ రూప ప్రక్రియ కూడ తెలుసు కనుక, తన రూపాన్ని మార్చుకొని, వొక బ్రాహ్మణ కుమారుని రూపం ధరించింది, అతని పేరు కుంభముని (కుండ నుండి జన్మించినవాడు) శిఖధ్వజుని ముందు ప్రత్యక్షమయింది.

శిఖధ్వజుడు వెంటనే లేచి, తన ముందున్న బ్రాహ్మణ యువకునికి ప్రణమిల్లాడు, అతను భూమిని తగలకుండా గాలిలో నిలబడటం గమనించాడు. చూడాల తన యోగ శక్తిని గురించి, భర్తకు తెలియజేయటానికి గాలిలో నిలబడ్డది. "శిఖధ్వజుడిలా మాట్లాడాడు" ఓ కుంభమునీ! నేను కఠోరమైన తపస్సు చేశాను కాని నాకింతవరకు ఆత్మ జ్ఞానము లభించలేదు పైగా నాకు బాధలు యినుమడించాయి.

కుంభముని యిలా సమాధానం చెప్పాడు, "నిత్యానందము పొందటానికి గురు పాదముల ముందు ఆశీనుడై, శృతులను వింటూ, గురుమూర్తి వుపదేశించిన మహా వాక్యములందు, ఉపనిషత్ వాక్యములందు యేకాగ్ర దృష్టితో మనసు లగ్నముచేసి, సాధన చేయాలి. ఎప్పడైతే గురుమూర్తి ప్రసాదించిన జ్ఞానమతనిలో పరిపక్వతను కలిగిస్తుందో, అప్పడా శిష్యుడు, నిత్యానందసుధను గ్రోలుతాడు.

"నీవెందుకు ఋషులు, సత్పురుషుల సాంగత్యముతో, బంధము, మోక్షము యొక్క స్వభావమును గురించి చర్చించవు? 'నీవెవరవు? ఈ ప్రపంచమెలా వచ్చింది? ఎప్పడేవిధంగా మరల తన వునికిని కోల్పోతుంది? నీవెందుకు అజ్ఞాన స్థితిలో వుండి, మూర్ఖుల యొక్క కృత్రిమమైన ఆట వస్తువులతో సంబరపడిపోతున్నావు? భూమిలోని రంధ్రములలో వుండే క్రిమిలా యెందుకు వ్యర్థ జీవితము గడుపుతున్నావు? మున్నగు ప్రశ్నలను గురించి, నీవెందుకు తీవ్రంగా విచారణ చేయవు? జ్ఞానమొక్కటే అన్నింటి కంటే మిన్నయైనది."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మే 2017**

10 బుధ - వైశాఖ పూర్ణిమ -శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

16 మంగ - బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము, లీలా కళ్యాణము.

21 ఆది - శ్రీ గురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

24 బుధ - మాస శివరాత్రి , పావులూరులో ఏకాహం.

25గురు - అమావాస్య.

**జూన్ 2017**

03 శని - జేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి దశమ వార్షికారాధన.

09 శుక్ర - పౌర్ణిమ , శ్రీ సద్గురు పాద పూజ.

19 సోమ - శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

22 గురు - మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

24 శని - అమావాస్య.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

సద్గురుమూర్తి అవిముక్తుడు అంటే తత్త్వజ్ఞానాన్ని వదిలిపెట్టని వాడు. తత్వజ్ఞానమే ఆయన స్వరూపము. మట్టికుండలో మట్టి అవిముక్తము. మట్టిలేకుండా కుండ ఉండదు కదా! అలాగే జీవునిలో



ప్రకాశవైన చైతన్యము లేక గురుతేజస్సు అవిముక్తము. బింబము లేకుండా ప్రతిబింబము ఉండదు కదా. అలాగే సాధకుడు సద్గురుమూర్తిని విడిచిపెట్టినా ఆయన నిన్ను విడిచిపెట్టడు.

సద్గురుమూర్తి సమాశ్రయం ద్వారా సంసార సముద్రాన్ని నశింపజేసే జ్ఞానాన్ని పొందుతున్నాడు. పరమాత్మ తత్త్వం జీవునిలో పేరుకుపోయిన మాయా మోహన రూప అజ్ఞానము, జీవభావమే కాక జీవునికి విషయ ప్రపంచంతో గల సంబంధం జీవుడు దానికిచ్చే విలువలను తొలగించివేస్తుంది. నిదుర నుండి మేల్కొన్న వ్యక్తి తన స్వప్నంలో కలిగిన అనుభవాలేవి లేనట్లు ఆత్మజ్ఞానం కలిగిన మరుక్షణం వాసనాబంధాలను ఛేదించుకుని పరిపూర్ణుడౌతాడు.

సాధకులు సద్గురుమూర్తి ఉపదేశించిన ఆధ్యాత్మిక విద్యను నిరంతరము నిత్యఉపదేశముగా సాధన చేయాలి. అందువలననే దానిని స్వాధ్యాయం అంటారు. అలా చేసినప్పుడే ఆ భావాలు కేవలం బుద్ధితో అవగాహన చేసుకోవటమే కాక అనుభవానికి వస్తాయి. సాధన అనేది కేవలం కాషాయాంబరం ధరించటం కాకుండా దేహమనోబుద్ధులనే ప్రకృతి ఆవరణము నుండి విడివడి, మానసిక స్థితిలో మార్పురావాలి.

సాధకుడు ఎంత గొప్పవాడైనా, ఎంత మంచిగా ప్రవర్తిస్తున్నప్పటికీ తనలోవున్న సంకల్పాలు, తాను పూర్వాశ్రమంలో ఆచరించిన కార్యాలు,

స్మృతులు వెంటాడుతూనే వుంటాయి. వాటినుండి తప్పించుకోలేడు సుమా! పశ్చాత్తాప పడుతూనే వుంటాడు. ఈ వాసనా భారాన్ని మోస్తున్నంత కాలం పరమత్మ తత్త్వంపై మనస్సు నిలవదు. దీనికి ప్రత్యామ్నాయం మానసిక చికిత్స మాత్రమే. సద్గురుమూర్తి సమాశ్రయమే దీని నుంచి పరిరక్షించగల ఏకైక మార్గము.

ఆత్మానుభూతిని పొందిన తరువాత మనస్సు, బుద్ధి అనే ఉపకరణాలలో వక్రభావాలు, ద్వంద భావాలు, పరిణామాలు ఉండవు. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను అధిగమించి తురీయావస్థను చేరుకుంటాడు. అదే కైవల్య పథము. అది నిత్యమైనది, సత్యమైనది. అక్కడ అనిత్యమైన జీవభావానికి  స్థానం లేదు. అది కేవల స్థితి అంటే అక్కడ పరిమితులకు, మాయాకల్పితమైన భ్రమలకు స్థానము లేదు. అది మేలుకొలుపు. అది నిజమైన జాగ్రదావస్థ. అది సద్గురు ప్రసాదితము.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

మే 2017

10 బుధవారం -వైశాఖ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

21 ఆదివారం -శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - ఉదయం 10గం.లకు ఆకుపూజ; శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

జూన్ 2017

09 శుక్రవారం - జేష్ఠ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

19 సోమవారం - శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీ తారక పరబ్రహ్మ ప్రసాద్

వీరు 1931లో జన్మించారు. వీరి పూర్వ నామధేయం, శ్రీ సన్నిధానం రామ తారక పరబ్రహ్మశాస్త్రిగారు. అగ్రహారీకులు, గుండుగొలను గ్రామ వాసులూ అయిన శ్రీ సీతారామశాస్త్రి మహాలక్ష్మమ్మల ద్వితీయ కుమారుడు. వీరు హైదరాబాదులో రైల్వే పున్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉన్నప్పుడు శ్రీసాధు శ్రీనివాస శాస్త్రిగారిని ఆధ్యాత్మిక గురువులుగా ఆశ్రయించి సేవిస్తూ ఉండేవారు.



వీరి అకుంఠిత గురుభక్తికి నిదర్శనం -శ్రీ శ్రీనివాసశాస్త్రిగారు అస్వస్థులుగా ఉన్నప్పుడు, తారకంగారు గుండుగొలనులో శ్రీబాబును దర్శించి తమ గురుదేవులకు స్వస్థత కలిగించమని వేడుకున్నారు. శ్రీబాబు, "గురుదేవులు సర్వస్వతంత్రులు. దేహ త్యాగం వారి ఇచ్ఛ ప్రకారం జరుగుతుంద"ని చెప్పి, "ఇకనుండి నీవు నా దగ్గరకు వచ్చేవాడవు అవుతావు" అని చెప్పారు. 1975లోశ్రీగురు దేవులతో బాటు శ్రీ తారకంగారు కేదారనాథ్ యాత్రకు వెళ్ళారు. అక్కడ శ్రీ బాబు తారకంగారికి దీక్షను అనుగ్రహించారు.

శ్రీ తారకంగారి అకుంఠిత గురుభక్తికి రెండవ నిదర్శనం - శ్రీబాబు 1982లో అస్వస్థతకు గురి అయినప్పుడు శ్రీ గురుదేవులకు ఎలాగైనా స్వస్థత చేకూర్చాలని తీవ్రంగా మంత్రానుష్ఠానం చేయసాగారు. శ్రీబాబు వారికి ఒక మంత్రాన్ని ఇచ్చి "దీనిని అనుష్ఠానం చేసుకో. ఇది నీకు ఇహ పర తారకమవుతుంది" అన్నారు. అప్పటినుండి వారు ఆ అనుష్ఠానం చేస్తూ వచ్చారు.

తారకంగారు తన ద్రవ్యమునుగాని, సమయమునుగాని, తాము నేర్చిన విద్యనుగాని సదా పరహితార్థమై వినియోగిస్తూ,

జిజ్ఞాసువులలో  కలిగే సందేహాలను నివృత్తి చేస్తూ, భక్తులలో గురుభక్తిని నెలకొల్పటానికి తమ వంతు ప్రయత్నం చేశారు.

1988 నవరాత్రోత్సవాలలో శ్రీబాబు ఉపన్యాసం చెబుతూ, శ్రీ వెంకటరమణ ప్రసాద్ వారిచేత, శ్రీ తారక పరబ్రహ్మ ప్రసాద్ వారిచేత "యస్య సర్వే సమారంభాః కామ సంకల్ప వర్జితాః। జ్ఞానాగ్ని దగ్ధకర్మాణి తమాహుః పండితా బుధాః॥" అనే భగవద్గీత శ్లోకానికి అర్థం చెప్పించి, తాము చేసిన భాషణము భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచేటట్లుగా చేశారు..

ఎన్నో అనన్యమైన సేవలను అందించిన శ్రీతారక పర బ్రహ్మ ప్రసాద్ గారు కొంత కాలంగా అస్వస్థతకు గురియై, నిశ్చల చిత్తులై శ్రీగురుదేవులయందు తమ దృష్టిని నిలిపి ది. 24-3-2017 శుక్రవారం నాడు గురుసాయుజ్యాన్ని పొందారు.

వారి కుమార్తె శ్రీ కాళీమాత ఈ సందర్భంలో మాట్లాడుతూ, 'మా నాన్నగారు గురు భక్తి కన్నా గురుతత్త్వ ఉపాసకులు' అన్నారు.  వారి గురు భక్తి, గురు సేవా తత్పరత ఏస్థాయిలో ఉన్నదో మనం చూశాం. గురు భక్తి, గురు తత్త్వ ఉపాసన ఒకటే కాని రెండు కాదు.

శ్రీ కాళీమాత ఇంకా మాట్లాడుతూ, ' మా నాన్న గారు స్వశక్తితో పైకి వచ్చినవారు.  గులాబీ పువ్వు ఉన్నచోట సువాసనలు వెల్లి విరియటం సహజమే. కాని ఒక వెలగ పండు పైకి గట్టిగా ఉండి తన సౌరభాన్ని వెదజల్లటం అరుదు. అటువంటి కోవకు చెందినవారు మా నాన్నగారు' అన్నారు.

'చేతనైనంత వరకు భగవన్నామ స్మరణ చేయటమే గురుకృపా సాధనకు మూలం. జీవితం ఎట్టి ఒడుదుడుకులకులోనైనా, శ్రీగురుదేవులు నిశ్చింత, నిర్వికార స్థితులను నాకు అనుభవంలో ప్రసాదిస్తున్నారు' అని తెలిపారు శ్రీ తారక పర బ్రహ్మ ప్రసాద్ గారు.

ఈ సందర్భంలో శ్రీ తారక పర బ్రహ్మ ప్రసాద్ వారి కుటుంబ సభ్యులకు శ్రీ గురుదేవులు, మనోస్థైర్యాన్ని, మనశ్శాంతిని ప్రసాదించెదరు గాక!

# రాబోయే జన్మ

- రామతీర్థ కథ

ఒక కుక్క, ఒక పిల్లి ఓ గురువుగారి దగ్గర శిష్యరికం స్వీకరించాయి. రెంటికీ ఒకరే గురువు కాబట్టి అవి రెండు కలిసి తిరిగేవి. కానీ పిల్లి బుద్ధులను చూసి కుక్కా, కుక్క బుద్ధులను చూసీ పిల్లీ లోలోపల ఆశ్చర్యపడుతూ వుండేవి. ఇటువంటి బుద్ధులు గలవి వచ్చే జన్మలో ఏమైయి పుడతాయా? అని పరస్పరం మనస్సులో అస్తమానం ఆలోచిస్తూ వుండేవి.



అదే విషయాన్ని కుక్క లేనప్పుడు పిల్లి, గురువుగారితో "ఆ కుక్క మహాముక్కోపి. దేన్ని చూసినా గుర్రు మంటుంది. ఇది వచ్చే జన్మలో ఏమై పుడుతుంది స్వామీ!" అని అడిగింది.



అలాగే పిల్లి లేనప్పుడు కుక్క, "స్వామీ! ఆ పిల్లివన్నీ దొంగ చూపులు. విశ్వాసమనేది దానిలో ఏ కోశానా కనబడదు. వచ్చే జన్మలో అది ఏమై పుడుతుంది?" అని అడిగింది.

గురువుగారు మొదట చెప్పేటందుకు యిష్టపడకపోయినా, రెండూ కలిసి అస్తమానం ఒత్తిడి చేయటంతో "ఇదిగో చూడండి! పిల్లి ఎప్పుడూ కుక్క బుద్ధుల గురించే ఆలోచిస్తోంది, అలాగే కుక్క ఎప్పుడూ పిల్లి బుద్ధులను గురించే ఆలోచిస్తోంది. మీ మీ భక్తి వదిలివేసి, ఏ ఏ బుద్ధులను ఏవగించుకుంటూ ఆలోచిస్తున్నారో ఆ లక్షణాలతోనే వచ్చే జన్మలో మీరిద్దరూ తిరిగి జన్మిస్తారు. అంటే కుక్క పిల్లిగానూ, పిల్లి కుక్కగానూ జన్మ ఎత్తుతారు" అని సమాధానం యిచ్చారు.



# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము 103 వ శ్లో॥

మల్లై శ్శైలేన్ద్రకల్ప శిశురిత జనైః।
పుష్పచాపోఽఙ్గనాభిర్గో పైస్తు ప్రాకృతాత్మా దివి కులిశభృతా
విశ్వకాయోఽ_ప్రీయమః
క్రుద్ధః కంసేన కాలో భయచకిత దృషా యోగిభిర్ధేయ మూర్తి
ర్దృష్టో రఙ్గావ తారే హరి రమరగణా
నన్దకృత్వాతు యుష్మాన్॥



తాత్పర్యము -

కంసుని సభలో దారసిల్లిన యురములో చాణూరుడు మొదలగు మల్లుల చేర కొండతో తుల్యమైనవాడు, చూపరులచేత బాలుడు గను, స్త్రీల చేత మన్మధుడుగను, గోపాలుర చేత పామరుడుగను, ఆకాశము నుండి చూచుచున్న ఇంద్రుని చేత ఊహింపరాని విశ్వరూపముగల వానిగను, భయచకిత యైన కనులుగల కంసుని చేత కోపము గొనిన యమునిగను, యోగుల చేత ధ్యానించ దగిన యాకృతి గలవాడుగా తలచబడిన వాడును, దానవ సంహారి, దేవతాగణసంతోషకారియునగు శ్రీకృష్ణుడు మిమ్ములను రక్షించుగాక!

రాచబాటలో రథం వేగంగా పరుగెడుతోంది. రథంలో నూతనంగా వివాహమైన దేవకీవసుదేవులున్నారు. అనుంగు చెల్లెలు దేవకిని రథంలో కూర్చోబెట్టుకుని ఆమె అన్నగారైన కంసుడు స్వయంగా రథం నడుపుతున్నాడు. అంతలో ఆకాశవాణి పలుకులు వినవచ్చాయి. కంసుని తల మీద పిడుగు పడినట్లుగా 'ఆమె అష్టమ గర్భం నిన్ను సంహరిస్తుంది' అని. వెంటనే ఆమె తలపట్టి, కత్తిని దూసి, చంపటానికి సంసిద్ధుడైన కంసుని వసుదేవుడు పుట్టిన ప్రతిబిడ్డనూ నీకిస్తానని

అనునయంగా వేడుకున్నాడు.

ఎనిమిదవ గర్భం కదా తనకి మృత్యువు అని కంసుడు శాంతించాడు. అయితే ఇద్దరినీ కంసుడు మధురలో చెరసాలలో పెట్టాడు.

కాలం గడుస్తుండగా నారదుడు వచ్చి, దేవకీవసుదేవులు, వ్రేపల్లె వాసులూ అందరూ దేవతాజాతి అని చెప్పగా విని, కంసుడు అంతకు మునుపు విడిచిపెట్టిన ఆరుగురు సంతానాన్ని కూడా దారుణంగా నరికి వేశాడు. దైవాజ్ఞ వలన యోగమాయ ఏడో గర్భం విచ్ఛిన్నమైనట్లు కల్పించి అది నందుని యింట్లో తలదాచుకుంటున్న వసుదేవుని భార్య రోహిణి గర్భంలో వుంచింది. అతడే బలరాముడిగా ప్రసిద్ధిచెందాడు.

అష్టమ గర్భంలో శ్రీమన్నారాయణుడు దేవకి గర్భవాసాన అవతరించి, వాని ఆజ్ఞమీదనే వసుదేవుడు ఆ బాలుని వ్రేపల్లెలో యశోద ప్రక్కలో ఉంచి, అక్కడున్న బాలికను తీసుకువచ్చి కంసునిచేతిలో పెట్టాడు. కంసుడు ఆ బాలికను ఆకాశంలోకి విసిరివేయబోగా ఆమె ఆదిపరాశక్తిగా ప్రకటితమైనది. ఆమె తనతోబాటే పుట్టిన బాలుడు వేరొక చోట పెరుగుతున్నాడని, వాడే కంసుని సంహరిస్తాడని ప్రకటించింది.

వెంటనే కంసుడు తన పరివారాన్ని నలువైపులా పంపించి, పసివారందరినీ సంహరించమని ఆజ్ఞాపించాడు. ఆ రాక్షసులందరూ బాలకృష్ణుని చేతిలో హతులైనారు.

మల్లయుద్ధంలో చాణూర ముష్టికుల కనులకు బలరామ కృష్ణులు ఇద్దరూ పెద్ద కొండలలాగ కనిపించారు. యుద్ధరంగంలో ఇతరులకు పాలబుగ్గల పసివారుగా కనిపించారు. స్త్రీలకు బాలకృష్ణుడు మన్మథుడిగా కనిపించాడు. గోపబాలురకు తమతో ఆడుకునే పామరుడుగా కనిపించాడు. ఆకాశంలో నుండి చూసే ఇంద్రునికి ఊహింపనలవిగాని విశ్వరూపునిగా కనిపించాడు. భయంతో ఉన్న కంసునికి యమునిలాగ కనిపించాడు. యోగుల మనస్సునందు ధ్యానింప దగిన ఆకృతికలవాడుగా కనిపించాడు.

ఇన్ని రూపాలతో ఇన్ని విధాలుగా దేవతాగణ సంతోషకారియైన ఆ చిన్ని కృష్ణుడు మిమ్ములను రక్షించుగాక!!

# అనన్య భక్తి

- పరాశర ప్రసాద్

శ్రీ శంకర భగవత్పాదులవారి శిష్యులలో పద్మపాదులవారు చాలా ముఖ్యులు. ఆయనకు బాల్యంలోనే నరసింహస్వామి ఉపాసన చేసి, దర్శనం పొందాలనే కోరిక కలిగింది. దానికోసమై అరణ్యానికి వెళ్ళి ఏకాంత ప్రదేశంలో తన తపస్సును ప్రారంభించాడు. ఒక కిరాతకుడు ఆయనను చూసి ఆశ్చర్యపోయి, ఆయనను సమీపించి, “స్వామీ! ఈ ప్రదేశము చాలా ప్రమాదమైనది. క్రూర జంతువులు సంచరిస్తాయి” అని హెచ్చరించాడు.

పద్మపాదులవారు ఆ కిరాతకునితో యదార్థం చెబితే యితనికి తెలియదు, అసత్యం ఆడటం తగదు అనే ఉద్దేశ్యంతో “నేను ‘నరసింహం‘ అనే జంతువును సందర్శించటానికి వచ్చాను. అది ఈ ప్రాంతంలో వుంటుందిట.” అన్నారు. కిరాతకుడు అదివిని ఆశ్చర్యపోయి, నరసింహం అనే జంతువు పేరు తాను ఇంతవరకూ వినలేదని, అయితే ఆ జంతువుని తాను కూడా దర్శించాలనే కోరిక కలిగిందని, వెంటనే ఆ జంతువు వివరాలను కనుక్కొని, వాటిని తన భావనలో నిలుపుకుని, ‘ఆ మృగం ఈ అడవిలో ఎక్కడ వున్నా, రేపు సాయంత్రం లోగా తీసుకువచ్చి, మీకు చూపిస్తాను’ అని ప్రతిజ్ఞచేసి, అలాకాని పక్షంలో నా ప్రాణం విడనటానికి వెనుకాడనని వాగ్దానం చేసి ‘నరసింహ’ అన్వేషణకు బయలుదేరాడు.

ఆ బోయవాడు పద్మపాదులవారు వర్ణించిన విధంగా ఆ జంతువు రూపాన్ని తన మనస్సులో ముద్రించుకుని అన్వేషణ ప్రారంభించాడు. అతని మనస్సులో ఏకాగ్రమైన ఎడతెగని ధ్యానం జరుగుతోంది. తాను వాగ్దానం చేసిన గడియ సమీపిస్తోంది కానీ, ఆ నరసింహం జాడకానరాలేదు.

బోయవాడు మనస్సులో భావన చేశాడు “స్వామి ఎన్నడూ అసత్యం ఆడడు. తప్పక ఆ జంతువు ఈ అరణ్యంలోనే వుంటుంది. ఆ జంతువుని దర్శించి తన వాగ్దానం నిలబెట్టుకోలేక పోయిన తన జీవితం వ్యర్థం” అని. ప్రక్కనే వున్న ఒక చెట్టుకి త్రాడుకట్టి ఉరిపోసు కోవటానికి

అంతా సిద్ధం చేసుకున్నాడు. ఆ బోయవాని అమాయక ఏకాగ్రతకు ప్రసన్నుడై నరసింహస్వామి వెంటనే ప్రత్యక్షమయ్యాడు! సింహం తలను, మనిషి మేనును కలిగిన ఆ జంతువును చూసి, ఆనంద పడిపోయి చెట్టు మీద నుండి క్రిందకు దూకి, తాను ఉరిపోసుకో దలచిన తాడుతోనే ఆ స్వామిని బంధించాడు. ఆ మృగాన్ని (స్వామి) తీసుకువచ్చి, పద్మపాదుని ఎదురుగా నిలబెట్టాడు. “స్వామీ! ఇదిగో మీరు కోరిన నరసింహ మృగం. ఇక మీరు అరణ్యాన్ని వదలిపెట్టి నిశ్చింతగా మీ ఇంటికి తిరిగి వెళ్ళండి” అన్నాడు.



కానీ పద్మపాదులవారికి బోయవాని చేతిలో త్రాడు మినహా ఏమీ గోచరించటం లేదు. విషయం బోధపడింది. శ్రీ నరసింహస్వామి బోయవానికి దర్శనమిచ్చారు, కానీ తనకు ఆయన దర్శనం ప్రాప్తించ లేదని కన్నీరు కారుస్తూ “స్వామీ! నేను మీ దర్శనం కోసమే ఈ అరణ్యానికి వచ్చాను. మీరు ఈ పామరుణ్ణి అనుగ్రహించారు కానీ నీ దర్శన భాగ్యం నాకు కలుగలేదు” అని ప్రార్థించాడు.

ఆ క్షణంలో అశీరవాణి వినబడింది “కోటి సంవత్సరాలు రూప ధ్యానం చేసినా అలవడని ఏకాగ్రత ఒక్క రోజులో బోయవానికి అలవడింది. యోగులకు సహితం లభ్యంకాని ఏకాగ్ర చిత్తంతో నన్ను తన ప్రాణాలను పణంగా పెట్టి అన్వేషించాడు. ఇంతటి మహాభక్తుని సాహవాసంలో నన్ను చూడలేకపోయినా, నా వాక్కు వినగలుగుతున్నావు. నీకు మంత్ర సిద్ధిని ప్రసాదిస్తున్నాను. నీకు అవసరమయినప్పుడు సంకల్ప మాత్రం చేత నీకు సహాయం చేస్తాను” అన్నారు స్వామి.

ఈ మంత్రసిద్ధి తరువాత పద్మపాదులవారు శ్రీ శంకర భగవత్పాదులవారి శిష్యులవటమే కాక, కాపాలికుని సంహారానికి తాను పొందిన మంత్ర సిద్ధి ఉపయోగపడింది.

# మానవ నైజం

- సుబ్బారావు

రామాపురం జమీందారుకు ఒకసారి సుస్తీ చేసింది. తీవ్రంగా అస్వస్థతతో బాధపడుతున్నాడు. వైద్యులు యిచ్చిన ఔషధంతోపాటుగా ఒక మండలం అంటే 41రోజులు ఏకాగ్రతతో ఆంజనేయస్వామిని ధ్యానం చేస్తే బాగుంటుందని, తిరిగి తప్పక మామూలు మనిషి కాగలడని ఎవరో పెద్దలు సలహా యిచ్చారు.

జమిందారుగారు నాలుగురోజులపాటు రోజూ ఆంజనేయ స్వామి గుడికి వెళ్ళారు. కానీ ఏకాగ్రత కుదరలేదు. ఆలయ పూజరిని ఏకాగ్రత కుదారలంటే ఏం చేయాలని సలహా అడిగారు. దానికి ఆ పూజారి సమాధానం చెబుతూ "ఈ మండలం రోజులూ కూడా ధ్యాన సమయంలో కోతి రూపాన్ని మాత్రం మనస్సులో రాకుండా జాగ్రత్త పడండి. 41రోజులూ పూర్తి అయ్యాక కానీ మీ మనస్సులోకి ఏ రూపం వచ్చినదీ ఏవరికీ చెప్పకూడదు. మధ్యలో చెబితే మీ ప్రాణానికే ప్రమాదం. అర్థమయిందా కోతి రూపాన్ని మటుకు మనస్సులోకి రానీయకండి!" అని హెచ్చరిక చేస్తూ చెప్పాడు పూజారి.



మండలం పూర్తి అయింది. జమిందారుగారికి కాస్త స్వస్థత లభించింది. ఆరోగ్యం కుదుటపడింది. ఆయన ఆలయానికి వచ్చి పూజారి గారితో 'నేను ఎంత ప్రయత్నించినా ఈ మండలం రోజులూ నాకు ఆ కోతి రూపమే మనస్సులోకి వచ్చిందండి' అని దిగులుగా చెప్పాడు.

ఆ పూజారి నవ్వుతూ 'ఇంకేం? మీ ప్రయత్నం ఫలించినది. ఏది వద్దనుకుంటే అదే మనస్సులోకి వస్తుంది. అదే మానవ నైజం. మీరు స్మరించేది ఆంజనేయ మంత్రం! వచ్చినది కోతి రూపం! అందుకే నేను అలా సలహా ఇచ్చాను"

# లోభి - పేద

- ఎన్. జనార్థన్

ఒక ఊళ్ళో ఒక వడ్డీ వ్యాపారస్థుడు వుండేవాడు. వ్యాపారం మీద లక్షలకి లక్షలు గణించాడేకాని పరమ పిసినిగొట్టు. కడుపు నిండా తిండి కూడా తినకుండా ధనం కూడబెట్టి ఇనప్పెట్టెలో దాచి, దాన్ని చూసుకుని మురిసిపోతూ వుండేవాడు.

ఒకనాడు అతని దగ్గరకు ఒక పేదవాడు వచ్చి, తాను లోగడ తీసుకున్న డబ్బును తిరిగి యిచ్చేస్తూ, "అయ్యా! నీకు ఇవ్వవలసిన డబ్బు కన్నా కొంచెం హెచ్చు యిస్తాను. నన్ను ఒక్కసారి నీ ఇనపెట్టెలో ధనాన్ని చూడనిస్తావా?" అని అడిగాడు.

"సరే! చూస్తే ఏం పోయింది? దానికి అదనంగా డబ్బు యిస్తాను అంటున్నాడు కదా! అనవసరంగా ఎందుకు పోగొట్టుకోవాలి?" అని మనస్సులో అనుకుని వడ్డీవ్యాపారి తన ధనాన్ని ఆ పేదవాడు చూడటానికి అంగీకరించాడు.

ఆ పేదవాడు ధనికుడి ఇనప్పెట్టెలో వున్న ధనాన్ని చూసి, "అయ్యా! ఇప్పుడు నేనూ నీ అంత ధనవంతుణ్ణి అయ్యానన్నమాట!" అన్నాడు.

" అదెలా? అలా అంటున్నావేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగాడు ఆ లోభి.

"ఆ డబ్బును చూసుకోవటం తప్ప నువ్వు చేస్తున్నదేమిటయ్యా? దాన్ని నేనూ చూశాను. తిండీ, బట్టా, వగైరా విషయాలలో నీకంటే నేనే నయంగా వున్నాను" అంటూ ఆ పేదవాడు శెలవు పుచ్చుకున్నాడు.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

అక్కడ శ్రీబాబు దీపావళి పండుగకు ఏలూరులో ఆండాళమ్మ గారింటికి వచ్చారని తెలిసి, వేణమ్మతో సహా కవిగారి కుటుంబమంతా ఏలూరు వెళ్ళారు. దీపావళి నాటి రాత్రి ఏలూరులో శ్రీబాబుతో కలిసి వారందరు ఎంతో కన్నుల పండుగగా దీపావళి జరుపుకున్నారు. అదే విషయాన్ని వివరంగా తెలుపుతూ వేణమ్మ "ఇక్కడకు రావటం వలన శ్రీబాబుతో దీపావళి ఆనందమంతా వేవేలు పొందాము. మీరు రాకపోవటం మీ దురదృష్టం" అని లెనిన్‌ను ఉడికిస్తూ ఉత్తరం వ్రాసింది. ఈ ఉత్తరం లెనిన్‌కు, లెనిన్ వ్రాసిన ఉత్తరం వేణమ్మకు ఒకేరోజున చేరాయి. ఈ దివ్యసంఘటనను, ఏలూరులో ఆండళ్ళమ్మ కుటుంబం వాళ్ళేగాక, కవిగారి కుటుంబము, ఆచార్యులుగారు యితర పోతునూరు, గుండుగొలను భక్తులు, నరసాపురంలో విశ్వనాధంగారి కుటుంబము తదితరులు ఒకే సమయంలో దర్శించారు. ఇలా ఏదో కొద్ది నిముషాలు గాక, ఒక రోజు రోజంతా నరసాపురంలోను, ఏలూరులోను ఒకే మారు అందరు భక్తులతో శ్రీబాబు సంచరించారు! ఈ సంఘటన మహాద్భుతమని భక్తులందరు శ్రీబాబును సంస్తుతించుకున్నారు.



ఇంతకంటె అద్భుతమైన సంఘటన 1961 దసరా ప్రారంభంలో జరిగింది. గుండుగొలనులో భవానమ్మగారింట్లో శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలు ప్రారంభమవుతాయని ముందుగానే కవిగారి కుటుంబము, వేణమ్మ తదితరులు గుండుగొలను వచ్చేశారు. శ్రీబాబు అప్పటికే భీమవరం నుండి వచ్చి ఉన్నారు. ప్రారంభం రోజున పూజకు కావలసిన ఏర్పాట్లన్నీ మామూలుగా వేణమ్మ, చంపక ( భీమవరం తాతయ్యగారి

కోడలు) కలిసి చేసేవారు. అప్పటికి భీమవరం తాతయ్యగారి కుటుంబం వారెవరూ రాలేదు. అందువలన మరొకరితో కలిసి వేణమ్మ పూజకు అన్ని ఏర్పాట్లూ చేసింది. శ్రీబాబు పూజ పూర్తి చేసి తీర్థప్రసాదాలిచ్చారు. చంపక ఎప్పుడూ ఈపూజలకు రాకుండా, శ్రీబాబు సేవ చేసుకోకుండా ఉండేది కాదు. వేణమ్మ శ్రీబాబును చంపక విషయం ఎన్నిసార్లు అడిగినా "వస్తుందిలే, తొందరేమిటి?" అని దాట వేశారు. ఇలా మూడు రోజులు గడిచాయి. నాలుగోరోజు ఉదయానికి భీమవరం తాతయ్యగారి కుటుంబము వారందరు వచ్చారు. శ్రీబాబుకు నమస్కారం చేసుకున్నారు. శ్రీబాబు పూజకు వెళ్ళారు. వేణమ్మ చంపకతో "ఇన్నాళ్ళు రాకపోవటానికి కారణం ఏమిటి?" అని అడిగింది. చంపక "శ్రీబాబు పదిరోజుల నుండి భీమవరంలోనే ఉన్నారు. పెద్ద చెల్లాయికి (పరశురామయ్యగారి పెద్దకుమార్తె సీతమ్మగారు) సుస్తీ చేసి చాల ఎక్కువగా ఉండటం వల్ల శ్రీబాబు అక్కడే ఉండి ప్రతిరోజూ రెండు పూటలా తీర్థ ప్రసాదములిస్తూ ఆమెను చూసుకుంటున్నారు. మాకు నవరాత్రుల మాట జ్ఞాపకం వచ్చినా, శ్రీబాబు ఎక్కడ ఉంటే అక్కడే నవరాత్రి పండుగ అనుకుంటూ అక్కడ ఆనందంగానే ఉన్నాము. పెద్ద చెల్లాయికి కొంచెం కులాసా యిచ్చిందని, నిన్న రాత్రి శ్రీబాబు పూజా పీఠంతో సహా బయల్దేరి వచ్చారు. మేము వుదయమే బయల్దేరి వచ్చాము" అన్నది. ఇది గుండుగొలనులో దసరాకు వచ్చిన భక్తులందరికి తెలిసింది. నాలుగురోజులపాటు, భీమవరంలోను గుండుగొలనులోనూ రెండుచోట్ల శ్రీబాబు ఒకేసారి ఉన్నారంటే, అది సర్వవ్యాపకుడైన సర్వేశ్వరునికి మాత్రమే సాధ్యమని, శ్రీబాబు సాక్షాత్ పరమేశ్వర స్వరూపులే అని, వేనోళ్ల శ్రీగురుదేవుని దివ్యత్వమును, తమ తమ అనుభవాలను గుర్తు చేసుకుంటూ బ్రహ్మానంద భరితులైనారు. అప్పుడే కవిగారు శ్రీబాబును "నవరసాధిపతి"గా అభివర్ణిస్తూ,

**"ఉపనిషత్కాంతా మృదూక్తులా కర్ణించి**
**కనుగీటినాడు శృంగార రసము, ......**
**సహకారివై ఒకే సమయాన పెక్కుతా**
**వుల గోచరించి అద్భుతరసమ్ము...................**
**చూపితివి గుప్తమూర్తివి శుభకరుడవు....."**

అని శ్రీబాబు దివ్యలీలలను అభివర్ణించారు.

- సశేషం

# విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

## మీరాబాయి

- రమణ ప్రసాద్

### మేలుకొలుపు

జాగో మ్హారా జగపతి నాయక్ హస్ బోలో క్యూ నహీ ।హరి ఛో జీ హిరదా మాహి పట్ ఖోలో క్యూ నహీ ॥ తన్ మన్ సురతి సంజోయి సీస్ చరణా ధరూ। జహా జహా దేఖూ మ్హారో రామ్ తహా సేవా సేవా కరూ ॥ సదై కరూ జీ సరీర్ జాగై జుగ్ వారణౌ। ఛోడీ ఛోడీ కుల్ కీ లాజ్ శ్యామ్ థారే కారణై ॥ బందీ హూ ఖానాజాద్ మ్హారి కరి మాన్‌జ్యౌ॥ హా హామ్హారా నాథ్ సునాయ్ బిలమ్ నహి కీజియై। మీరా చరణా కీ దాసీ దరస్ ఫిర్ దీజియై॥



''జగన్నాయకా! మేలుకో. చిరునవ్వులొలుకుతూ నిదుర లే. నీవు నా హృదయంలోనే ఉన్నావు. అయినా నా హృదయద్వారాలు ఎందుకు తెరిపించవు ప్రభూ? నా తనుమన ప్రాణాలు అర్పించి నీ పాదాలపై వాలిపోయిన నన్ను చేరదియ్యి. నువ్వు ఎక్కడ వున్నా వచ్చి నీ సేవ చేస్తాను. జన్మ జన్మలకు నేను నీ దాసిని. నా ప్రార్థనను మన్నించి ఏ మాత్రమూ ఆలశ్యం చెయ్యకుండా నాకు నీ దర్శనం ఇచ్చి అనుగ్రహించు ప్రభూ!"

### ప్రార్థన

" ఓ హరీ! నువ్వు జనులను రక్షించి వారి భయాన్ని తొలగించు. నువ్వు ఎందరినో రక్షించావు. ద్రౌపదికి అక్షయ వలువలను ప్రసాదించి ఆమె మానాన్ని కాపాడావు. నీ భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించటానికి,

నరహరి రూపం ధరించి హిరణ్యకశిపుడిని సంహరించావు. గజరాజును మొసలిబారినుండి కాపాడావు. నీ దాసి మీరా నీ చరణ కమలాలను ఆశ్రయించింది. నిన్ను రక్షించమని వేడుకొంటున్నది."

**విరహం**

" ఓ సఖీ! నేను కృష్ణునికోసం ఎదురు చూసి నా కన్నులు కాయలు కాశాయి. కన్నీరు ఏకధారగా ప్రవహిస్తోంది. నా మనస్సులో అతని మధురరూపం నిలిచిపోయి నా హృదయంలో ముద్రితమయింది. గిరిధరుని రాకకోసం నా భవనం ముందు నుంచుని ఎదురు చూసి చూసి వేసారిపోయాను. నేను గిరిధరునకు అంకితమైపోయాను. నాప్రియుడు రానిదే నా ప్రాణం నిలువదే సఖీ! లోకులు నన్ను గురించి పలురకాలుగా అనుకుంటున్నారు. అన్నపానాదులు రుచించటంలేదు. కృష్ణా! నువ్వు వచ్చి దర్శనమిస్తే కాని నా మనస్సు శాంతింపదు. నీ రాకకోసం ఎదురుచూస్తూనే ఉంటాను ప్రభూ!"

"మనమోహనా! నీ పలుకులు ఎంత మధురంగా ఉంటాయయ్యా! నీ చిలిపి చేష్టలు నన్ను ఎంతగానో అలరిస్తాయి. నేను విరహిణిని. నీ కోసం నగరమంతా డోలు వాయిస్తూ నీ పైన ప్రేమను తెలుపుతూ పాడతాను. హే శ్యామసుందరా! నేను నీ సఖిని. నా విన్నపాలు ఆలకించి నన్ను కరుణించు. నవ్వు రాకపోతే జోగినినియై నగరం అంతా నీకోసం గాలిస్తాను. వనాలన్నీ వెతుకుతాను. నా శరీరమంతా విభూతి రాసుకుని, మెడలో వనమాలలు ధరించి నిన్నే తలుస్తూ ఉంటాను. నువ్వు దర్శనం ఇవ్వకపోతే శరీర త్యాగం చేస్తాను."

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL